ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
మంగళవారం 26 ఆగస్టు 2025



అధ్యక్ష పీఠం ఎవరిని వరిస్తుందో...?

- రాజంపేట పార్లమెంటు అధ్యక్ష పదవిపై పలువురి ఆసక్తి
- త్రీమెన్ కమిటీకి పలువురు దరఖాస్తు
- పదవి కోసం నాయకుల మధ్య పోటీ



(రాయచోటి-ఆంధ్రజ్యోతి): రాజంపేట పార్లమెంటు అధ్యక్ష కుర్చీ ఎవరిని వరిస్తుందో...? అనే ఉత్కంఠ జిల్లా రాజకీయ వర్గాలలో నెలకొంది. ఆ పార్లమెంటు పరిధిలో బలమైన ఓటు బ్యాంకు కలిగి.. గతంలో రాజకీయంగా విశేష ప్రాధాన్యతను కలిగి ఉన్న బలిజ సామాజిక వర్గానికి ఇస్తారా? కమ్మ సామాజిక వర్గానికి ఇస్తారా? పార్లమెంటులో అధిక స్థాయిలో ఓటు బ్యాంకు ఉన్న మైనార్టీలకు ఇస్తారా? కొత్తగా బీసీలు, ఎస్సీ వర్గాలకు ఏమైనా అధ్యక్ష పదవిని కట్టబెడతారా అని చర్చ నడుస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా తెలుగుదేశం పార్టీ సంస్థాగత ఎన్నికలు పూర్తి చేసే క్రమంలో భాగంగా అన్ని పార్లమెంటు స్థానాలకు నూతనంగా అధ్యక్షులను నియమిస్తోంది. ఈ నేపధ్యంలో టీడీపీ అధినాయకత్వం అధ్యక్షుల ఎంపిక కోసం ముగ్గురు సభ్యుల కమిటీని ఏర్పాటు చేసింది. దీంతో సోమవారం రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రాంనారాయణరెడ్డి, ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు, కర్నూలు డీసీఎంఎస్ చైర్మన్ వై.నాగేశ్వర్‌యాదవ్‌లు పార్లమెంటు విస్తృత స్థాయి సమావేశానికి హాజరయ్యారు. స్థానిక సుధ ఫంక్షన్ హాలులో జరిగిన సమావేశంలో పాల్గొన్న వీరికి పలువురు తమ అధ్యక్ష పదవి కోసం దరఖాస్తులను అందజేశారు.

పి.సురేంద్రయాదవ్



తంబళ్లపల్లె నియోజకవర్గం కురబలకోట మండలానికి చెందిన సురేంద్రయాదవ్.. 2004లో బూత్ కన్వీనర్‌గా పనిచేశారు. 2005 స్థానిక సంస్థల ఎన్నికల్లో వార్డు మెంబరుగా టీడీపీ తరపున గెలిచారు. 2009 నుంచి 2024 వరకు పార్టీ అభ్యర్థుల గెలుపుకోసం పని చేశారు. 2013లో సర్పంచ్‌గా పోటీ చేసి ఓడిపోయారు. 2015లో కురబలకోట మండల బీసీ విభాగం అధ్యక్షుడిగా పని చేశారు. 2016 నుంచి 22 వరకు కురబలకోట టీడీపీ మండల అధ్యక్షుడిగా పని చేశారు. 2019 ఎన్నికల్లో కురబలకోట జడ్పీటీసీ సభ్యుడిగా పోటీ చేశారు. 2021 నుంచి పార్లమెంటు బీసీ సెల్ అధ్యక్షుడిగా పనిచేస్తున్నారు. వైసీపీ కాలంలో ఇతడిపై అనేక వేధింపులు, 13 అక్రమ కేసులు బనాయించారు. ఇతనికి చెందిన 5 ఎకరాల భూమిని జగనన్న కాలనీలకు కేటాయించారు. ఇంకా అనేక వేధింపులకు గురయ్యారు.

దొమ్మలపాటి రమేశ్



మదనపల్లె నియోజకవర్గానికి చెందిన ఈయన స్థానిక ప్రఖ్యాత బీటీ కళాశాలలో విద్యనభ్యసించే రోజుల్లో యూత్ యూనియన్ లీడర్‌గా, ఆర్గనైజింగ్, తదితర వివిధ హోదాల్లో పని చేశారు. టీడీపీ ఆవిర్భవించిన 1983 నుంచి పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ స్థానికంగా కీలకంగా మారారు. 1989-1994 మధ్యలో ఉమ్మడి చిత్తూరు జిల్లా తెలుగు యువత అధ్యక్షుడిగా పనిచేశారు. 1994 అసెంబ్లీ ఎన్నికల్లో మదనపల్లె నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి స్వల్ప ఓట్ల తేడాతో ఓడిపోయారు. 2004 అసెంబ్లీ ఎన్నికలలో టీడీపీ తరపున ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2019లో ఓటమి చెందారు. 2019 నుంచి 2024 అసెంబ్లీ ఎన్నికల వరకు టీడీపీ ఇన్‌చార్జ్‌గా కొనసాగారు. 2024 ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి షాజహాన్‌బాష గెలుపు కోసం పని చేశారు. 2023లో జరిగిన టీడీపీ యువనేత నారా లోకేష్ యువగళం పాదయాత్రలో కీలక పాత్ర పోషించారు. నియోజకవర్గంలో ఇప్పటికీ ఆయన కంటూ బలమైన వర్గం ఉంది.

పంతగాని నరసింహ ప్రసాద్



రైల్వేకోడూరు నియోజకవర్గానికి చెందిన ఈయన మేనమామ శివప్రసాద్ గతంలో టీడీపీ తరపున ఎంపీ, ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2019లో నరసింహప్రసాద్ రైల్వేకోడూరులో టీడీపీ తరపున ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయారు. అప్పటి నుంచి రైల్వేకోడూరు నియోజకవర్గం టీడీపీలో క్రియాశీలంగా ఉంటున్నారు. ఆయన ప్రస్తుతం టీడీపీ రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షులుగా పనిచేస్తున్నారు. ఈయనకు ఎస్సీ వర్గాల్లో మంచి పట్టుంది.

మల్లారపు రవిప్రకాశ్



ఈయన ప్రస్తుతం తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పనిచేస్తున్నారు. పార్టీ ఆవిర్భావం నుంచి తెలుగుదేశం పార్టీలో ఉన్నారు. 2004, 2009 ఎన్నికల్లో అప్పటి తెలుగుదేశం పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం పని చేశారు. ముఖ్యమంత్రిగా కిరణ్‌కుమార్‌రెడ్డి పనిచేసిన కాలంలో పార్టీ ఆదేశాల మేరకు పీలేరు నియోజకవర్గ కో-ఆర్డినేటర్‌గా పనిచేశారు. 2014లో పీలేరు నియోజకవర్గంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో అభ్యర్థులను గెలిపించుకున్నారు. 2019, 2024 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి గెలుపు కోసం కృషి చేశారు.

షేక్ ముస్తాక్ అహ్మద్



ప్రస్తుతం తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా పనిచేస్తున్నారు. ఈయన తండ్రి డాక్టర్ దాదాసాహెబ్ 1985లో తెలుగుదేశం పార్టీ తరపున రాయచోటి నియోజకవర్గానికి పోటీ చేసి ఓడిపోయారు. గతంలో ఎన్టీఆర్ హయాంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ అధ్యక్షుడిగా, హజ్‌కమిటీ సభ్యుడిగా పనిచేశారు. ముస్తాక్ గతంలో టీడీపీ జిల్లా కార్యదర్శిగా పని చేశారు. ఇటీవల జరిగిన ఒంటిమిట్ట జడ్పీటీసీ ఎన్నికల్లో పార్టీ తరపున ప్రచారం చేశారు. గతంలో నెల్లూరు రూరల్ పార్టీ పరిశీలకులుగా పని చేశారు. రాయచోటి నియోజకవర్గంలో పార్టీ సభ్యత్వ నమోదులో క్రియాశీలకంగా వ్యవహరించారు. ప్రతి ఎన్నికల్లోనూ పార్టీ అభ్యర్థుల కోసం పని చేశారు.

సుగవాసి ప్రసాద్‌బాబు



సుగవాసి పాలకొండ్రాయుడు కుటుంబం 43 సంవత్సరాలుగా టీడీపీలో ఉంటోంది.. పాలకొండ్రాయుడు నాలుగు పర్యాయాలు ఎమ్మెల్యేగా, ఒకసారి ఎంపీగా గెలిచారు. ఆయనకు రాయలసీమ స్థాయిలో బలిజ సామాజికవర్గంలో బాగా గుర్తింపు ఉంది.. ఆయన కొడుకు సుగవాసి ప్రసాద్‌బాబు 31 సంవత్సరాలుగా తెలుగుదేశం పార్టీలో క్రియాశీలకంగా ఉన్నారు. ప్రస్తుతం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా పనిచేస్తున్నారు. గతంలో టీటీడీ బోర్డు సభ్యులుగా పని చేశారు. రాయచోటి మున్సిపాలిటీలో 2005లో ఫ్లోర్ లీడర్‌గా పనిచేశారు. 1994 నుంచి ఆయన తండ్రి ఎమ్మెల్యేగా పోటీ చేసిన ప్రతి ఎన్నికల్లోనూ పార్టీ గెలుపు కోసం పనిచేశారు. 2024లో జరిగిన సాధారణ ఎన్నికల్లో రాయచోటి టీడీపీ అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, రాజంపేట టీడీపీ అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం కోసం కష్టించి పనిచేశారు. గతంలో వైఎస్ హయాం నుంచి అనేక అక్రమ కేసులు ఎదుర్కొన్నారు. జిల్లాలో బలిజ సామాజికవర్గంలో మంచి పట్టుంది.

బోనమల ఖాదర్‌వలి



2004 నుంచి రాజకీయంగా క్రియాశీలకంగా ఉన్నారు. 2009లో వక్ఫ్ బోర్డు వైస్ ప్రెసిడెంటుగా పనిచేశారు. 2017 నుంచి టీడీపీ పట్టణ అధ్యక్షుడిగా పనిచేస్తున్నారు. అన్ని ఎన్నికల్లోనూ టీడీపీ అభ్యర్థుల గెలుపు కోసం పనిచేశారు. 2021లో పట్టణంలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల కోసం కృషి చేశారు. ఇటీవల జరిగిన ఒంటిమిట్ట జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి గెలుపు కోసం ముమ్మర ప్రచారం నిర్వహించారు. 2024 సాధారణ ఎన్నికల్లో రాయచోటి టీడీపీ అభ్యర్థి రాంప్రసాద్‌రెడ్డి గెలుపు కోసం పనిచేశారు.

ప్రజా సమస్యలను పరిష్కరించండి



అర్జీదారుల సమస్యలు వింటున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి (నేతాజీ సర్కిల్), ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో నిశితంగా పరిశీలించి త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్‌ఎస్ హాలులో ప్రజా పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిర్ధిష్ట కాలపరిమితిలోగా ప్రజా సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. నియోజకవర్గ, మండల ప్రత్యేక అధికారులు అంగన్వాడీ సెంటర్లలో మధ్యాహ్న భోజన పథకం, ఎస్‌డబ్ల్యుపీసీ, గృహ నిర్మాణ పనులను పర్యవేక్షించి సమస్యలను గుర్తించి వాటిని త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేయాలని అధికారులకు సూచించారు. చిట్వేలికి చెందిన పుల్లగంటి ఈశ్వరమ్మ తనకు హౌస్‌హోల్డ్ మ్యాపింగ్ సమస్య వల్ల వితంతు పింఛన్ మంజూరు కావడం లేదని కలెక్టర్‌కు విన్నవించారు. వీరబల్లి మండలం గడికోట దళితవాడకు చెందిన ఎం.అంజనమ్మ బియ్యం కార్డులో తమ పేరును పునరుద్ధరించాలని కలెక్టర్‌కు దరఖాస్తు ఇచ్చారు. మదనపల్లె మండలం వెంకప్పకోట గ్రామం పున్నూరువాండ్లపల్లెకు చెందిన ఎస్.జయమ్మ సదరం సర్టిఫికెట్‌లో 69 శాతం వికలత్వం ఉందని, నాకు వికలాంగ పింఛన్ మంజూరు చేయాలని కోరింది. సంబేపల్లె మండలం నారాయణరెడ్డిపల్లె గ్రామం సద్దలవాండ్లపల్లెకు చెందిన ఎం.రామచంద్ర తనకు అన్నదాత సుఖీభవ పథకం వర్తింపచేయాలని కోరారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, డీఆర్వో మధుసూదన్‌రావు, రాయచోటి ఆర్డీవో శ్రీనివాస్, ఏడీ సర్వేయర్ భరత్‌కుమార్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

యూరియా కొరత సృష్టిస్తే చర్యలు తప్పవు

- విజిలెన్స్ అధికారులు

గుర్రంకొండ, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): రైతులకు అవసరమైన ఎరువులను కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు విక్రయిస్తే ఆ వ్యాపారులపై చర్యలు తప్పవని కడప విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ రహమత్‌బాష, తహశీల్దార్ లక్ష్మీప్రసన్న హెచ్చరించారు. గుర్రంకొండ పట్టణంలోని పలు ఎరువుల దుకాణాలను సోమవారం వారు తనిఖీ చేసి స్టాక్ రికార్డులను పరిశీలించారు. వ్యాపారులు ఎన్ని రకాల ఎరువులను విక్రయిస్తున్నారు... ఎంత ధరకు అమ్ముతున్నారు.. రైతులకు బిల్లులు ఇస్తున్నారా లేదా అని అడిగారు. స్టాక్ వివరాలను బోర్డులో నమోదు చేయాలని వ్యాపారులకు సూచించారు. అనంతరం సీఐ మాట్లాడుతూ రైతులకు అవసరమైన ఎరువులను వ్యాపారులు అందుబాటులో ఉంచాలన్నారు. రైతులు కొనుగోలు చేసే ఎరువులకు తప్పకుండా బిల్లులు ఇవ్వాలని చెప్పారు. యూరియా స్టాక్ ఉన్న వ్యాపారులు ప్రభుత్వ ధరలకే విక్రయించాలన్నారు. వ్యాపారులు నిబంధనలు ఉల్లంఘిస్తే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం ఎరువుల గోడౌన్‌లో ఉన్న స్టాక్‌ను తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏవో రత్నమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.





గుర్రంకొండలో ఎరువుల స్టాక్‌ను తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

పటిష్ట నాయకత్వానికే పగ్గాలు

- అధికారం లేనప్పుడు కష్టపడిన వారిని గుర్తించండి
- పార్టీకి నాయకుడు కాదు కార్యకర్తలే మూలం
- మంత్రి ఆనం రామనారాయణరెడ్డి



మాట్లాడుతున్న దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

రాయచోటి (నేతాజీ సర్కిల్), ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): టీడీపీలో పటిష్ట నాయకత్వానికి పగ్గాలు ఇస్తామని, రాజంపేట పార్లమెంట్ అధ్యక్ష పదవి అలంకారం కాదని బాధ్యతని, ప్రతిపక్ష పార్టీల విమర్శలను ఎదుర్కొనే సామర్థ్యం కలిగిన నాయకులకే అధిష్ఠానం పదవులు కేటాయిస్తుందని దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. రాయచోటి పట్టణం సుధా ఈవెంట్స్ కల్యాణ మండపంలో సోమవారం జరిగిన పార్లమెంటరీ కమిటీ సమావేశంలో 7 నియోజకవర్గాలకు చెందిన టీడీపీ కార్యకర్తలు, నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం మాట్లాడుతూ రాజంపేట పార్లమెంట్ కమిటీ ఎంపిక కోసం అధిష్ఠానం త్రీమెన్ కమిటీని నియమించిందని తెలిపారు. అందులో తనతో పాటు ఆప్కాబ్ చైర్మన్ రామాంజనేయులు, కర్నూలు డీసీఎంఎస్ చైర్మన్ నాగేశ్వరరావును నియమించిందని తెలిపారు. రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి, రాజంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి చమర్తి జగన్‌మోహన్ రాజు, రైల్వేకోడూరు ఇన్‌చార్జ్, కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి, తంబళ్లపల్లె ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి, పుంగనూరు ఇన్‌చార్జి చల్లా బాబు, మాజీ ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి, పాల ఏకరి రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ నాగేశ్వర్‌నాయుడు, జంగం సంక్షేమ సంఘం కార్పొరేషన్ చైర్మన్ చంద్రశేఖర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. తొలుత ఎన్టీఆర్ చిత్రపటం వద్ద జ్యోతి వెలిగించి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో 1.18 కోట్ల సభ్యత్వాలు కలిగిన పెద్ద పార్టీ టీడీపీ అని తెలిపారు. పార్టీలో కష్టపడి పనిచేసే వారికి ఎప్పుడూ గుర్తింపు ఉంటుందన్నారు. నాయకులు మారినా కార్యకర్తలు పార్టీకి ద్రోహం చేయరని తెలియజేశారు. పీలేరు ఎమ్మెల్యే కిశోర్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ కష్టకాలంలో పార్టీ కోసం పోరాడిన వారిని గుర్తుంచుకోవాలన్నారు. రాజంపేట ఇన్‌చార్జి, పార్లమెంట్ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు మాట్లాడుతూ పార్టీ అధిష్ఠానం కష్టపడిన వారికి తగిన గుర్తింపు ఇస్తుందన్నారు. కార్యకర్తలే పార్టీకి మూల స్తంభాలని తెలిపారు. రాజంపేట పార్లమెంట్ పరిధిలో ఏడు నియోజకవర్గాల్లో 35 మంది సభ్యులతో కమిటీ వేయడం జరుగుతుందని తెలిపారు. సంస్థాగత అనుబంధ కమిటీలు 17 ఉన్నాయని, ఒక్కొక్క కమిటీలో 28 మంది సభ్యులు ఉంటారని తెలియజేశారు. అభ్యర్థుల నుంచి వచ్చే అభ్యర్థనలను స్వీకరించి రాష్ట్ర అధిష్ఠానానికి పంపుతామని తెలిపారు. అధిష్ఠానం నిర్ణయం మేరకు రాజంపేట పార్లమెంట్ అధ్యక్ష పదవితో పాటు కమిటీ సభ్యులను ఎంపిక చేస్తారని తెలిపారు.

దానిమ్మకు వైరస్ పోటు

- నల్లగా మాడిపోయి రాలిపోతున్న కాయలు
- దానిమ్మ రైతులకు రూ.కోట్లలో నష్టం

6

అట్టహాసంగా చందన షాపింగ్ మాల్ ప్రారంభం



చందన షాపింగ్‌మాల్‌ను ప్రారంభిస్తున్న సినీ నటి ఐశ్వర్య రాజేశ్, బాలనటుడు రేవంత్

మదనపల్లె, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : వస్త్ర వ్యాపారంలో రాష్ట్రంలో అగ్రగామిగా గుర్తింపు పొందిన చందన మాల్ సోమవారం మదనపల్లి పట్టణంలో తన శాఖను ఘనంగా ప్రారంభించింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మదనపల్లి ఎమ్మెల్యే షాజహాన్ బాషా, మున్సిపల్ చైర్మన్ మనుజారెడ్డి, సినీ నటి ఐశ్వర్య రాజేశ్, బాలనటుడు రేవంత్ (బుల్లిరాజు), మాజీ ఎమ్మెల్యేలు డి.రమేష్, డి.అస్సారెడ్డి, టౌను బ్యాంకు మేనేజర్ ఎస్.విద్యాసాగర్, వైసీపీ ఇన్‌చార్జ్ నిస్సార్ అహ్మద్ బాషా, బీజేపీ నాయకులు కిరణ్‌కుమార్, సాయిలోకేష్, కౌన్సిలర్ బి.రామకృష్ణారెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే షాజహాన్‌బాషా మాట్లాడుతూ మహానగరాలకే పరిమితమైన చందన, సీఎంఆర్ షాపింగ్ మాల్‌లు మదనపల్లిలో ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. ఈ షాపింగ్‌మాల్ ద్వారా మదనపల్లెలో నిరుద్యోగులు 200 మందికి ఉపాధి కల్పిస్తున్నందుకు చందనా సీఎంఆర్ అధినేతలను అభినందించారు. వేలాది రకాల వెరైటీ వస్త్రాలను సరసమైన ధరలకు చందనా షాపింగ్ మాల్ అందిస్తోందని ప్రజలు అందరూ కొనుగోలు చేయాలని ఆయన కోరారు. మదనపల్లిలో చందన షాపింగ్ మాల్ ప్రారంభోత్సవానికి విచ్చేసిన సినీ నటులు ఐశ్వర్యరాజేష్, బాలనటుడు రేవంత్ (బుల్లిరాజు) సినీ డ్యాన్సులతో ఖాతాదారులను అలరింపచేశారు. అనంతరం వారు మాట్లాడుతూ చందనా షాపింగ్ మాల్‌లో అత్యంత తక్కువ ధరలకు వస్త్రాలు విక్రయించడంతో పాటు సోమా సిల్వర్ ఆభరణాలను విక్రయిస్తున్నారని తెలిపారు. వినాయక చవితి పండుగ వేడుకలు చందనాతో చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

హత్య కేసును ఛేదించిన పోలీసులు

- నిందితుడు అరెస్ట్
- వివరాలు వెల్లడించిన ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

రాయచోటిటౌన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని మహిళ మృతి చెందిన కేసును ఎట్టకేలకు పోలీసులు ఛేదించి నిందితుడిని అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు వివరాలు వెల్లడించారు. ఈనెల 18వ తేదీ చిన్నమండెం చిన్నమండెం మండలం దేవళంపేట రిజర్వ్ ఫారెస్టులోని ఆంజనేయస్వామి ఆలయం సమీపంలో గుర్తు తెలియని మహిళ మృతి చెందినట్లు చిన్నమండెం పోలీసులు కేసు నమోదు చేశారని తెలిపారు. మదనపల్లె మండలం సవరంపల్లి గ్రామం పొన్నేటిపాలెంకు చెందిన కృష్ణమూర్తి భార్య ముదిమడుగు శ్రీదేవి (45)కి, రాజంపేట నియోజకవర్గం నుండుపల్లె మండలం మడితాడు గ్రామం నాయునివారిపల్లెకు చెందిన గురిగింజకుంట శివమల్లప్పనాయుడు కుమారుడు శివప్రసాద్‌నాయుడు కొంత కాలంగా సన్నిహితంగా ఉండేవారన్నారు. ఈ క్రమంలో నిందితుడు పలుమార్లు డబ్బు అడిగితే ఆమె ఇవ్వకపోవడంతో ఇద్దరి మధ్య గొడవలు జరిగేవన్నారు. దీంతో తమ మధ్య ఉన్న సన్నిహిత సంబంధం గురించి బయటకు చెబుతానని మృతురాలు బెదిరించేదన్నారు. దీంతో నిందితుడు ఆమెను హత్య చేయాలని పథకం వేసుకున్నాడన్నారు. ఈనెల 4వ తేదీ మృతురాలు నిందితుడికి ఫోన్ చేసి 5వ తేదీ కలవాలని కోరిందన్నారు. ఈ క్రమంలో ఈనెల 5వ తేదీన మృతురాలు శ్రీదేవి తన స్వగ్రామం నుంచి బస్సులో గుర్రంకొండకు రాగా నిందితుడు ఆమెను తన మోటారు సైకిల్‌పై తీసుకెళ్లాడన్నారు. మార్గమధ్యంలో ఒక పెట్రోల్ బంక్‌లో ఒక బాటిల్‌లో పెట్రోలు కొనుగోలు చేశాడన్నారు. అదేరోజు ఉదయం 11.20 నుంచి 12 గంటల మధ్య అడవిలోకి తీసుకెళ్లి ఆమె చీరతోనే గొంతునులిమి హత్య చేసిన అనంతరం మృతదేహంపై పెట్రోలు పోసి కాల్చివేశాడన్నారు. ఆమె ఒంటిపై ఉన్న బంగారు గొలుసును తీసుకెళ్లాడని తెలిపారు. గుర్తు తెలియని మహిళ హత్యకు గురైన విషయాన్ని పశువుల కాపరులు గ్రామ వీఆర్‌వోకు సమాచారం ఇవ్వగా ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. పోలీసులు విచారిస్తుండగా నిందితుడే లొంగిపోవడంతో సోమవారం కోర్టులో హాజరు పరచినట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎం.వెంకటాద్రి, రాయచోటి రూరల్ సీఐ వరప్రసాద్, చిన్నమండెం ఎస్‌ఐ సుధాకర్, ఇతర పోలీసు అధికారులు, పోలీసులు సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా పవిత్రాల సమర్పణ



స్వామికి సమర్పించిన పవిత్రాలు

ఒంటిమిట్ట, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఒంటిమిట్టలోని కోదండరామ స్వామి ఆలయంలో జరుగుతున్న పవిత్రోత్సవాల్లో భాగంగా రెండోరోజు సోమవారం పవిత్రాల సమర్పణ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. సీతారామ లక్ష్మణ ఉత్సవాలు యాగశాలలో ఉంచి బాలభోగం, పవిత్రహోమం, మూలవిరాట్‌లకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. పాలు, పెరుగు, తేనె, పసుపు చందనంతో స్వామి అమ్మవారు ఉత్సవమూర్తులకు అభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో ప్రశాంతి, ఆలయ అధికారులు హనుమంతయ్య, నవీన్ కుమార్, అర్చకులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల నియంత్రణకు పటిష్ట చర్యలు

- జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్

6



దానిమ్మకు వైరస్ పోటు



ములకలచెరువు / పెద్దతిప్పసముద్రం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మాయదారి వైరస్.. దానిమ్మ రైతులను నిండా ముంచింది. బ్లైట్, ఆంత్రా కోస్ వైరస్‌ల దెబ్బకు చెట్లలోని కాయలు నల్లగా మాడిపోయి రాలిపోతున్నాయి. ఎన్ని మందులు కొట్టినా లొంగడం లేదు. వైరస్ తగ్గకపోవడంతో ఏం చేయలేక తోటలను వదిలేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా దానిమ్మ రైతులకు కోలుకోలేని దెబ్బ తగిలింది. వాతారణంలో మార్పులు...ముసురు వానతో ఎన్నడూ లేనంతగా వైరస్ విజృంభించింది. ప్రస్తుతం మార్కెట్‌లో దానిమ్మ ధరలు బాగా ఉన్నా రైతులకు ప్రయోజనం లేకుండా పోయింది. కంటికి రెప్పలా కాపాడుకున్న తోటలు వైరస్‌ల బారిన పడి కళ్లముందే మాడిపోయి రాలిపోతుండడంతో రైతులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. వైరస్‌ల కారణంగా దానిమ్మ రైతులకు రూ.కోట్లలో నష్టం వాటిల్లింది. తంబళ్లపల్లె నియోజకవర్గంలోని ములకలచెరువు, బి.కొత్తకోట, పెద్దతిప్పసముద్రం, తంబళ్లపల్లె, పెద్దమండ్యం, కురబలకోట మండలాల్లో సుమారు వెయ్యి ఎకరాల్లో దానిమ్మ తోటలు ఉన్నాయి. ఎకరాకు రూ.1.50 లక్ష నుంచి రూ.1.80లక్షల వరకు ఖర్చు చేసి తోటలను సాగు చేశారు. ఈ తోటలు ప్రతి ఏటా దిగుబడి ఇస్తున్నాయి. సహజంగా ప్రతి ఏటా వేసవి తరువాత జూన్ నెల నుంచి నెల నుంచి రైతులు పూత నిలబెడతారు. పూత నిలిపేందుకు మందులు, ఎరువులు వాడాల్సి ఉంటుంది. ప్రతి ఏటా ఎకరాకు రూ.లక్షకుపైగా ఖర్చు వస్తుంది.

- నల్లగా మాడిపోయి రాలిపోతున్న కాయలు
- మందులకు లొంగని రోగం.. తోటలను వదిలేసిన రైతులు
- దానిమ్మ రైతులకు రూ.కోట్లలో నష్టం



పాత ములకలచెరువు వద్ద వైరస్‌లతో వదిలేసిన దానిమ్మ తోటలు

ఎంతో ఆశతో రైతులు ఈ ఏడాది పూతను నిలిపి మందులు పిచికారి చేశారు. ఎరువులు కూడా వాడారు. తీరా కాయలు చేతికొచ్చే సమయంలో ముసురు వానలు, వాతావరణంలో మార్పుల కారణంగా దానిమ్మ తోటలు వైరస్ బారిన పడ్డాయి. అన్ని తోటలపై బ్లైట్, ఆంత్రా కోస్ వైరస్ దాడి చేశాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ రెండు వైరస్‌లు విజృంభించడంతో ప్రతి చెట్టులోని కాయలు నల్లగా మాడిపోవడంతో పాటు పగిలిపోయి రాలిపోతున్నాయి. రైతులు ఎన్ని మందులు కొట్టినా వైరస్‌లు తగ్గడం లేదు. వైరస్‌లు తగ్గకపోవడంతో కొందరు రైతులు తోటలను వదిలేశారు. ఎక్కడ చూసినా వైరస్‌ల బారిన పడ్డ తోటలే దర్శనమిస్తున్నాయి.

ధర బాగున్నా...

ప్రస్తుతం మార్కెట్‌లో దానిమ్మ ధర బాగున్నా ప్రయోజనంగా లేకుండా పోయింది. దానిమ్మ తోటలు వైరస్‌ల బారిన పడడంతో దిగుబడి ఏమాత్రం లేకుండా పోయింది. మార్కెట్‌లో టన్ను దానిమ్మ ధర రూ.లక్ష వరకు ఉంది. ఇక్కడి దానిమ్మ కాయలకు కర్నాటక, తమిళనాడు, తెలంగాణ, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల్లో డిమాండ్ ఉండేది. గత ఏడాది దానిమ్మ దిగుబడి బాగా వచ్చింది. కానీ ధర అంతంతమాత్రంగా ఉండడంతో రైతులు నష్టపోయారు. ఈ ఏడాది వైరస్‌ల కారణంగా దిగుబడి లేకపోవడంతో రైతులకు కోలుకోలేని దెబ్బతగిలింది.

సగానికి తగ్గిపోయిన తోటలు

తంబళ్లపల్లె నియోజకవర్గంలో దానిమ్మ తోటలు సగానికి తగ్గిపోయాయి. నియోజకవర్గ వ్యాప్తంగా గతంలో రెండు వేల ఎకరాల వరకు దానిమ్మ తోటలు ఉండేది. ప్రతి ఏటా పెట్టబడులు పెరుగుతుండడంతో పాటు వైరస్‌లతో నష్టాలు వస్తుడడంతో రైతులు తోటలను తొలగించడంతో సగానికి తగ్గిపోయాయి. ఇటీవల ములకలచెరువు మండలం కోటిరెడ్డిగారిపల్లె, గూడుపల్లె, పెద్దతిప్పసముద్రం మండలం కురవవాండ్లపల్లె తదతర గ్రామాల్లో సుమారు 50 ఎకరాల దానిమ్మ తోటలను రైతులు తొలగించి ఇతర పంటలు సాగు చేస్తున్నారు. అలాగే ములకలచెరువు మండలం నాయనిచెరువుపల్లె వద్ద 10 ఎకరాల దానిమ్మ తోటను పూత నిలపకుండా వదిలేశారు.

ఉద్యాన రైతులకు వరుస దెబ్బలు

ఉద్యాన పంటలు సాగుచేస్తున్న రైతులకు వరుస దెబ్బలు తగులుతూనే ఉన్నాయి. ఈ ఏడాది దోస సాగు చేసిన రైతులు వైరస్‌ల కారణంగా కాయలు సైజులు రాక, మచ్చలు వచ్చి దెబ్బతిని నష్టపోయారు. నియోజకవర్గంలో సుమారు 800 ఎకరాలకుపైగా దోస పంట వైరస్ బారిన పడడంతో రైతులకు తీవ్ర నష్టం వచ్చింది. అలాగే ఖర్బూజ పంట కూడా వైరస్‌ల బారిన పడింది. తాజాగా దానిమ్మ తోటలను కూడా వైరస్‌లు దెబ్బతీశాయి.

తేమ కారణంగా వైరస్

ముసురు వానలు వస్తుండడంతో తేమ శాతం అధికంగా ఉండడం వలన కాయాల్లో నల్ల మచ్చలు ఏర్పడి వైరస్ సోకుతోంది. దానిమ్మ పంటకు తక్కువ మోతాదులో నీరందించాలి. ఒక్క శాతం బోర్డు మిశ్రమాన్ని నీటిలో కలిపి పిచకారీ చేయాలి. కోతకు వచ్చే సమయంలో పంటకు రైతులు అజాక్సిస్ట్రాన్ అనే క్రిమిసంహారక మందును లీటర్ నీటిలో ఒక్క గ్రాము కలిపి పిచికారీ చేస్తే ప్రయోజనం ఉంటుంది.

- భీమేశ్, ఉద్యానశాఖ అధికారి, ములకలచెరువు

మందులు కొట్టినా తగ్గలేదు



ఆరు ఎకరాల్లో దానిమ్మ సాగు చేశాను. రూ.10లక్షల వరకు ఖర్చు చేశాను. ఇప్పుడు మూడో ఏడాది పూత నిలిపాను. ప్రస్తుతం ఎకరాకు రూ.లక్ష వరకు ఖర్చు చేశాను. కాయలు చేతికొచ్చే సమయంలో గత నెలలో కురిసిన ముసురు వానతో భూమిలో తేమ ఎక్కువై బ్లైట్, ఆంత్రా కోస్ వైరస్‌లు సోకాయి. గుజరాత్ రాష్ట్రం నాసిక్ నుంచి మందులు తెప్పించి కొట్టినా ప్రయోజనం లేదు.

- కిరణ్‌కుమార్, గూడుపల్లె, ములకలచెరువు మండలం

ఎన్నడూ లేనంతగా వైరస్ సోకాయి



11 ఎకరాల్లో దానిమ్మ తోట ఉంది. నాలుగోసారి పూత నిలిపాను. వాతారణంలో మార్పులు, ముసురు వానతో గతంలో ఎన్నడూ లేనంతగా వైరస్‌లు సోకాయి. కాయలన్నీ నల్లగా మాడిపోవడంతో పాటు పగిలిపోయి రాలిపోతున్నాయి. మందులు పిచికారి చేసినా ప్రయోజనం లేదు. చేసేదిలేక తోటను వదిలేశాను. ఈ ఏడాడి దిగుబడే లేదు. మార్కెట్‌లో ధర బాగా ఉన్నా నిరాశే మిగిలింది.

- శేషారెడ్డి, పాత ములకలచెరువు

సమస్యల పరిష్కారమే ప్రభుత్వ అజెండా

మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

చిన్నమండెం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ అజెండా అని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. సోమవారం తన స్వగ్రామమైన బోరెడ్డిగారిపల్లెలో ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడికి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి తక్షణమే అక్కడికక్కడే అధికారులకు ఫోన్ చేసి సకాలంలో సమస్యలను పరిష్కరించాలని సూచించారు. అలాగే ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం పడమటికోన గ్రామం వడ్డెపల్లెలో నూతనంగా వెలసిన శివాలయంలో మంత్రి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్తలు మంత్రిని గజమాలతో ఘనంగా సత్కరించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు పాటూరు విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయ బృందం

నందలూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): రాజంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈనెల 24న జరిగిన జిల్లా స్థాయి సబ్ జూనియర్స్ బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరచిన పాటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు చమర్తి సుదర్శన్‌రాజు మాట్లాడుతూ బాల్‌బ్యాడ్మింటన్ సెలక్షన్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎం.యేసుప్రియ, ఎస్.మన్సూర్ ఎంపికయ్యారని, తమ పాఠశాల విద్యార్థులు ఎంపిక కావడం అభినందనీయమన్నారు. ఈనెల 29, 30, 31వ తేదీల్లో ప్రకాశం జిల్లాలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో పీడీ సుస్మిత, పీఈటీ జగన్, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

చక్రంపేట విద్యార్థి ...



విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

పెనగలూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చక్రంపేట ఉన్నత పాఠశాలకు చెందిన సి.గురుచరణ్ అనే విద్యార్థి రాష్ట్రస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ క్రీడా పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గోపాలకృష్ణ తెలిపారు. ఆదివారం రాజంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణంలో జరిగిన జిల్లా స్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో గురుచరణ్ రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. సోమవారం పాఠశాలలో ఉపాధ్యాయ బృందం గురుచరణ్‌ను అభినందించి జ్ఞాపిక అందజేశారు.

కలికిరి విద్యార్థిని...



విద్యార్థినిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కలికిరి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ బాలికోన్నత పాఠశాలలో తొమ్మిదవ తరగతి చదువుతున్న జి.నిత్యశ్రీ రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో పాల్గొనడానికి ఎంపికయినట్లు హెచ్ఎం జయశ్రీ తెలిపారు. ఆదివారం మదనపల్లె గ్రీన్‌వ్యాలీ స్కూల్‌లో జూనియర్ విభాగంలో జరిగిన పోటీల్లో పాల్గొన్న నిత్యశ్రీ బాలికల విభాగంలో రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించింది. సెప్టెంబరు 13, 14, 15వ తేదీల్లో నెల్లూరులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో ఈ అమ్మాయి జిల్లా తరపున ఆడనుంది. ఈ సందర్భంగా నిత్యశ్రీకి శిక్షణ ఇచ్చిన పీడీ టి.చిన్నప్ప, విజేతగా నిలిచిన నిత్యశ్రీలను హెచ్‌ఎంతోపాటు ఉపాధ్యాయులు సోమవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో అభినందించారు.

మాదక ద్రవ్యాల నియంత్రణకు పటిష్ట చర్యలు

- *జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్*



పోస్టర్లను విడుదల చేస్తున్న జేసీ, అదనపు ఎస్పీ, తదితరులు

రాయచోటి (నేతాజీ సర్కిల్), ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మాదక ద్రవ్యాలను పూర్తి స్థాయిలో అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో మాదక ద్రవ్యాల జిల్లా స్థాయి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ మాట్లాడుతూ యువత మాదక ద్రవ్యాల బారినపడకుండా వాటి వినియోగం వల్ల కలిగే అనర్థాలపై విస్తృత అవగాహన కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఇప్పటి వరకు 530 ఉన్నత పాఠశాలల్లో ఇప్పటికే 430 ఈగల్ క్లబ్స్‌ను ఏర్పాటు చేశామని, త్వరితగతిన మిగతా స్కూల్స్‌లో పూర్తి స్థాయిలో ఈగల్ క్లబ్స్ ఏర్పాటు చేసి ప్రతి నెలా అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని డీఈవోను ఆదేశించారు. ఎక్సైజ్ శాఖ ఇంకా అవగాహన కార్యక్రమాలు పెంచాలని తెలిపారు.

మందుల షాపుల్లో డాక్టర్ రాసిన చీటీలు లేకుండా మందులు ఇవ్వరాదని, తరచూ మందుల షాపులను తనిఖీ చేయాలని డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్‌ను ఆదేశించారు. అడిషనల్ ఎస్పీ వెంకటాద్రి మాట్లాడుతూ జిల్లాలో పోలీసుశాఖ వారికి ఇప్పటికే 735 అవగాహన కార్యక్రమాలను నిర్వహించడం జరిగిందని, ఇంకా ఈ కార్యక్రమాలను పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇప్పటి వరకు 882 కేసులు పెట్టడం జరిగిందని తెలిపారు. అలాగే సీసీ టీవీ, డ్రోన్ల ద్వారా పర్యవేక్షించడం జరుగుతోందని తెలిపారు. అనంతరం పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మదనపల్లె సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డీఆర్‌వో మధుసూదన్‌రావు, రాయచోటి ఆర్డీవో శ్రీనివాస్, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ ఏఈఎస్ జోగేంద్ర, డీఎస్పీ, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు అండగా నిలవండి : ఎస్పీ



బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

రాయచోటిటౌన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చే బాధితులకు పోలీసు అధికారులు అండగా నిలవాలని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల సమస్యలను ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు స్వయంగా విన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ బాధితుల సమస్యలను చట్టపరంగా, వీలైనంత త్వరగా పరిష్కరించాల్సిన బాధ్యత ప్రతి పోలీసు అధికారిపై ఉందని తెలిపారు. ఫిర్యాదుదారులతో ప్రత్యక్షంగా మాట్లాడిన ఎస్పీ వారి సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదుల్లో ముఖ్యంగా కుటుంబ కలహాలు, సైబర్ మోసాలు, కుటుంబ సభ్యుల వేధింపులు, భూవివాదాలు, నకిలీపత్రాలు, అధిక వడ్డీలు, ఆన్‌లైన్ మోసాలు, ప్రేమ పేరుతో మోసాలు లాంటివి ఉన్నాయన్నారు. ప్రతి ఫిర్యాదుపై తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్ ద్వారా నేరుగా ఆదేశాలు జారీ చేశారు. ఫిర్యాదు దారులకు న్యాయం చేయండి, బాధితులకు బాసటగా నిలవాలని, చట్ట పరిమితుల్లో మానవీయంగా స్పందించండని ఎస్పీ సూచించారు. వృద్ధులు, వికలాంగులు, మహిళల ఫిర్యాదులకు ప్రాముఖ్యత నిస్తూ సమగ్రంగా విచారణ జరిపి త్వరితగతిన పరిష్కరించాలని స్పష్టం చేశారు.

శాంతియుతంగా జరుపుకోండి

- *జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్*

రాయచోటి (నేతాజీ సర్కిల్), ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి పండుగ శాంతియుతంగా జరుపుకోవాలని జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన వినాయక చవితి పండుగను శాంతియుతంగా సంప్రదాయబద్ధంగా నిర్వహించుకునేందుకు అడిషినల్ ఎస్పీ వెంకటాద్రి, మదనపల్లె సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణిలతో కలిసి శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ పండుగ సమయంలో అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు.

పండుగ రోజుల్లో నిరంతరం విద్యుత్ సౌకర్యాన్ని కల్పించాలని, అత్యవసర పరిస్థితుల్లో అప్రమత్తంగా ఉండాలని, ఆయా సంబంధిత అధికారులను సూచించారు. అడిషినల్ ఎస్పీ వెంకటాద్రి మాట్లాడుతూ విగ్రహాలను ఏర్పాటు చేసే ప్రాంతాల్లో రాత్రిపూట కమిటీ సభ్యులు వలంటీర్లను నియమించుకోవాలని తెలియజేశారు. సమావేశంలో డీఆర్‌వో మధుసూదన్‌రావు, రాయచోటి ఆర్డీవో శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్లు, డీపీవో, కాలుష్య నియంత్రణ మండలి సభ్యులు, వివిధ శాఖల అధికారులు, పండుగ కమిటీ ప్రతినిధులు, మత పెద్దలు పాల్గొన్నారు.

పాడి ఆవుల యజమానికి పరిహారం విడుదల

కలికిరి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): పిడుగుపాటు కారణంగా మృతి చెందిన రెండు పాడి ఆవుల యజమానికి పరిహారం విడుదల చేస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ములకలచెరువు మండలం సోంపల్లెకు చెందిన బీమిశెట్టి మస్తానప్పకు చెందిన రెండు పాడి ఆవులు ఏప్రిల్ 30న పిడుగుపాటుకు గురై మృతి చెందాయి. దీనిపై జూలై 25న కలెక్టరు పరిహారం విడుదల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. పరిశీలించిన ప్రభుత్వం రెండు పాడి ఆవులకు రూ.75 వేలు మంజూరు చేసింది. రైతు బ్యాంకు ఖాతాకు జమ చేయాలని కలెక్టరును ఆదేశిస్తూ రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి సోమవారం ఆదేశాలు జారీ చేశారు.

బార్ల దరఖాస్తుకు నేడు చివరి గడువు

రాజంపేట టౌన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట ఎక్సైజ్ శాఖ పరిధిలో ప్రభుత్వం రెండు బార్‌ల ఏర్పాటుకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఎక్సైజ్ సీఐ ఎం.మల్లిక ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బార్లు ఏర్పాటు చేసేందుకు ఆసక్తి గల వారు మంగళవారం సాయంత్రం 5 గంటల లోపు ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ ద్వారా గాని, దరఖాస్తు ప్రాసెసింగ్ ఫీజు చెల్లించి చేసుకోవచ్చునన్నారు. ఆసక్తి గలవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నీటి సంపులో పడి చిన్నారి మృతి



కురబలకోట, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): నీటి సంపులో పడి చిన్నారి మృతి చెందిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది.. దీనికి సంబంధించి బాధితులు, పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని విశ్వం కళాశాల పక్కనున్న పెద్దకటవకు చెందిన చిన్నప్పరెడ్డి, భార్గవి దంపతులు బతుకుదెరువు నిమిత్తం మూడేళ్లుగా మదనపల్లె పట్టణం బసినికొండలో నివాసం ఉండేవారు.

ఈ క్రమంలో తన కుమారుడు శ్యాంకృష్ణ(2)తో కలిసి ఈనెల 11న స్వగ్రామానికి వెళ్లారు. అయితే ఆరోజు రాత్రి ఇంటి ఆవరణలో బాలుడు ఆడుకుంటూ అనంతరం కనిపించకుండా పోయాడు. దీంతో తల్లిదండ్రులు, బంధువులు గాలించినా ఫలితం లేకుండా పోయింది. మరుసటి రోజు నీటి సంపులో బాలుడు శవమై కనిపించాడు.

ఇదిలా ఉండగా కుటుంబీకులకు తమ బిడ్డ మృతిపై అనుమానం రావడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు ముదివేడు ఎస్ఐ దిలీప్‌కుమార్ సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి చిన్నారి మృతదేహానికి అక్కడిక్కడే పోస్టుమార్టం నిర్వహించి కుటుంబీకులకు అప్పగించారు.

ఆటో కాల్చివేత



రైల్వేకోడూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓబనపల్లె దళితవాడ గ్రామం లో ఈ నెల 22న రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు కనుపర్తి రాజేంద్ర కు చెందిన ఆటోను నిప్పంటించారు. దీంతో ఆటో పూర్తిగా కాలిపోయింది. సోమవారం బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఆటోతోనే తన బతుకుదెరువు అని వాపోయాడు. తనకు గ్రామం లో ఎవరితోను శత్రుత్వం లేదన్నాడు. కానీ ఎందుకు నా ఆటోను కాల్చివేయాల్సి వచ్చిందని ఆందోళన వ్యక్తం చేశాడు. దీనిపై పోలీసులు సమగ్రంగా దర్యాప్తు చేసి తనకు న్యాయం చేయాలని కోరుతున్నాడు.

పాముకాటుకు గురైన రైతు

రైల్వేకోడూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎస్.కొత్తపల్లె గ్రామానికి చెందిన తిరుపతి చంద్రశేఖర్ అనే రైతు తన పొలంలో సోమవారం పనులు చేసుకుంటుండగా పాము కాటేసింది. దీంతో గ్రామస్తులు హుటాహుటిన రైల్వేకోడూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్య సిబ్బంది ప్రథమ చికిత్స చేసి ఎలాంటి ప్రమాదం లేదని చెప్పడంతో రైతు కుటుంబం ఊపిరి పీల్చుకుంది.

పాలకొండల్లో అటవీ అధికారుల పహారా

శ్రీగంధం తీసుకెళుతున్న ఒకరి అరెస్ట్... ఇద్దరు పరారీ



పట్టుబడిన దుంగలు, వ్యక్తితో ఫారెస్ట్ అధికారులు

సిద్దవటం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : పాలకొండ రిజర్వు అటవీ ప్రాంతంలో సోమవారం పహారా కాస్తుండగా శ్రీగంధం తీసుకెళుతున్న ఒకరిని అరెస్ట్ చేశామని, మరో ఇద్దరు పరారైనట్లు కడప రేంజర్ ప్రసాద్ తెలిపారు. భాకరాపేట సెక్షన్ సిబ్బంది, పాలకొండ రిజర్వు అటవీ ప్రాంతంలో ముగ్గురు వ్యక్తులు శ్రీగంధం దుంగలతో వెళుతూ కనిపించారన్నారు. అటవీశాఖ సిబ్బంది వారి వెంటపడగా ఇద్దరు పరారయ్యారని, ఒకరిని పట్టుకున్నట్లు తెలిపారు. పట్టుబడిన వ్యక్తి చిత్తూరు జిల్లాకు చెందిన ఎస్.విశ్వనాథ్‌గా నిర్ధారించామన్నారు. పట్టుబడిన వ్యక్తిని విచారించగా పరారైనవారిలో చిత్తూరు జిల్లాకు చెందిన కొత్తకోట సురేంద్ర, చంద్ర అనే వ్యక్తులు ఉన్నారని చెప్పాడన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి నిందితుడిని కోర్టులో హాజరు పరిచామన్నారు. పరారైన నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో భాకరాపేట ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ ఎస్.శ్రీనివాసులు, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ఎస్.రాజశేఖర్‌రాజు, భాకరాపేట బీట్ ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ పి.ఇంద్ర, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ జి.కిషోర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదాన ట్రస్టుకు రూ.1.7 లక్షల విరాళం



అన్నదాన ట్రస్టు సభ్యులకు చెక్కును అందచేస్తున్న దాతలు

తంబళ్లపల్లె, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లెకు సమీపంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మల్లయ్యకొండ మల్లికార్జునస్వామి సేవా సమితి అన్నదాన ట్రస్టుకు ఓ దాత రూ.1.7 లక్షలు విరాళం అందజేశారు. సోమవారం మండలంలోని ఎర్రసానిపల్లె సర్పంచ్ సుగుణ, వీరభద్ర దంపతులు కుటుంబ సభ్యులతో కలిసి అన్నదాన ట్రస్టు వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, కార్యదర్శి నారాయణరెడ్డి, ట్రస్టు సభ్యులకు రూ.1.7లక్షల చెక్కును అందచేశారు. ఈ సందర్భంగా దాతలు మాట్లాడుతూ.. మల్లయ్యకొండకు వచ్చే భక్తుల సౌకర్యార్థం అన్నదాన ట్రస్టులో పాలు పంచుకోవడం తమ అదృష్టమన్నారు. అన్నదాన ట్రస్టు సభ్యులు, స్థానిక నాయకులు దాతల దాతృత్వాన్ని అభినందించారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు సుధాకర్‌రెడ్డి, రమణారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, మురళీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మేము దివ్యాంగులం కాదా సారూ...!

- సామాన్యులే మమ్మల్ని అవిటివారిగా గుర్తిస్తారు..
- డాక్టర్లకు ఎందుకు అనిపించలేదో...
- మాకు న్యాయం చేసి ఆదుకోండి
- ఆవేదనతో ఆందోళనకు దిగిన దివ్యాంగులు



పులివెందుల ఆర్డీఓ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న దివ్యాంగులు



ఆందోళన చేస్తున్న దివ్యాంగులతో మాట్లాడుతున్న ఆర్డీఓ

పులివెందుల రూరల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మమ్మల్ని చూస్తూనే మేము దివ్యాంగులమని సామాన్యులు కూడా గుర్తి స్తారు.. కానీ డాక్టర్లు మాత్రం మమ్మల్ని దివ్యాంగులుగా గుర్తించ లేదు... దీంతో మా పింఛన్లు పోయాయంటూ ఆందోళనకు దిగారు. సోమవారం పులివెందుల ఆర్డీఓ కార్యాలయం ఎదుట దాదాపు 50 నుంచి 60 మంది దివ్యాంగులు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న ఆర్డీఓ చిన్నయ్య వారి వద్దకు వచ్చి ఆరా తీశారు. ఈ సందర్భంగా దివ్యాంగులు ఆర్డీఓ ఎదుట తమ ఆవేదన వెలిబుచ్చారు. సారూ మేము దివ్యాంగులమని గతంలోనే డాక్టర్లు మాకు సర్టిఫికెట్లు ఇచ్చారు. ఈ సర్టిఫికెట్లతో ప్రభుత్వం దివ్యాంగు లుగా గుర్తించి పింఛన్ అందిస్తోంది. ఈ పింఛన్ ఆగస్టు నెలలో ఇవ్వలేదు. ఎందుకు మాకు ఇవ్వలేదని ప్రశ్నిస్తే మీపేరు దివ్యాంగ పింఛన్ నుంచి తొలగించారని సచివాలయ సిబ్బంది చెప్పారు. దీంతో ఏమి చేయాలో అర్థం కావడం లేదు. గత కొన్ని నెలలుగా దివ్యాంగులకు సంబంధించిన వారందరినీ డాక్టర్లు పరిశీలించి ప్రభు త్వానికి నివేదిక ఇచ్చారు. ఈ నివేదికలో మేము దివ్యాంగులం కాదని డాక్టర్లు గుర్తించారంట, మమ్మల్ని చూస్తేనే దివ్యాంగులమని సామాన్యులకు కూడా తెలుస్తుంది. కానీ డాక్టర్లకు ఎందుకు మా పరిస్థితి అర్థం కాలేదో అని ఆర్డీవో ఎదుట వాపోయారు. మాకు న్యాయం చేయాలని కోరారు.

స్పందించిన ఆర్డీవో : దివ్యాంగుల బాధను, గోడును ఆలకించిన ఆర్డీవో వెంటనే స్పందించారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు వివరిస్తామన్నారు. మరోసారి వైద్యపరీక్షలు చేయించేలా ఉన్నతాధికారులకు తెలియజేసి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. దీంతో దివ్యాంగులు ఆందోళన విరమించారు.

యూరియా కొరత సృష్టిస్తే కేసులు

- విజిలెన్స్, పోలీసు అధికారుల హెచ్చరిక



ఎరువుల దుకాణంలో తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

జమ్మలమడుగు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): రైతులకు ఫర్టిలైజర్స్ దుకాణ యజమానులు అధిక ధరలకు యూరియా, ఇతర మందులు విక్రయించినా, కొరత సృష్టించినా కేసులు నమోదు చేస్తామనిఉమ్మ డి కడప జిల్లా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అడిషనల్ ఎస్పీ శ్రీనివాసరావు, వ్యవసాయ విజిలెన్స్ అధికారి ఖాజాహుస్సేన్, డీఎస్పీ వెంకటేశ్వరరావు హెచ్చరించారు. సోమవారం మధ్యాహ్నం జమ్మలమడుగు పట్టణంలో ఫర్టిలైజర్స్ దుకాణాలపై విజిలెన్స్, పోలీసు, వ్యవసాయ అధికారులు కలిసి దాడులు నిర్వహించారు. జమ్మలమడుగు ముద్దనూరు రోడ్డులోని ఫర్టిలైజర్స్ దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు. ఈ సమాచారం తెలుసుకున్న కొందరు దుకాణాల యజమానులు మూత వేసినట్లు రైతుల ద్వారా తెలిసింది. వ్యవసాయశాఖ ఏడీ అనిత, స్థానిక వ్యవసాయ అధికారి శ్రీకాంత్‌రెడ్డి, అర్బన్ సీఐ నరేష్‌బాబు, ప్రొద్దుటూరు త్రీటౌన్ సీఐ కె.వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గంధం మహోత్సవం



గంధం మహోత్సవం కార్యక్రమంలో పాల్గొన్న పీఠాధిపతి ఆరిఫుల్లా హుస్సేని

కడప కల్చరల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ప్రఖ్యాతి గాంచిన కడప అమీన్‌పీర్ దర్గాలో ఆదివారం రాత్రి 10వ పీఠాధిపతి హజరత్ అమీన్ పీర్ మాలిక్ గంధం మహోత్సవం, సోమవారం ఉరుసు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దర్గా పీఠాధిపతి అరిఫుల్లా హుస్సేని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి గంధం సమర్పించారు. దర్గా ఆవరణం నుంచి హజరత్ అమీన్‌పీర్ మాలిక్ మజర్ వరకు గంధం ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు.

ఉరుసు మహోత్సవాలకు పలువురు రాజకీయ నాయకులు, పుర ప్రముఖులు, సినీప్రముఖులు హాజరయ్యారు. ఏపీతో పాటు తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి భక్తులు వేలాదిగా పాల్గొన్నారు. రాత్రి 10 గంటలకు ప్రముఖ కవ్వాల్ మీరాజ్ వారిచే గొప్ప ఖవ్వాలి కార్యక్రమం నిర్వహించారు.

పోక్సో కేసులో ఇద్దరు యువకులకు బతికినంత కాలం జైలు



శిక్షపడిన ముద్దాయిలు

పూతలపట్టు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): పోక్సో కేసులో ఇద్దరు యువకులకు బతికినంత కాలం జైలు శిక్ష విధిస్తూ చిత్తూరు న్యాయస్థానం సంచలన తీర్పు ఇచ్చింది. మదనపల్లెకి చెందిన 16 ఏళ్ల బాలిక.. 2019 నవంబరు 24వ తేదీన తిరుమలకు వెళ్లి దేవుడి దర్శనం చేసుకుంది. అదే రోజు రాత్రి తిరుపతికి చేరుకుని తిరుచానూరుకు నడిచివెళుతుండగా బైక్‌పై వస్తుండిన తిరుపతి రూరల్ మండలం తిరుచానూరు సమీపంలోని బ్రాహ్మణపట్టుకు చెందిన చిత్తూరు వెంకటేష్ (34)ను లిఫ్ట్ అడిగింది. అతను బాలికను బైక్‌పై ఎక్కించుకుని తిరుచానూరులో దింపకుండా ముండ్లపూడి గ్రామం వైపు తీసుకెళ్లాడు. అక్కడున్న పొదలవద్ద బైక్‌ను ఆపి.. పెట్రోల్ అయిపోయింది.. తీసుకురమ్మని తన స్నేహితుడు బుక్కే రాజామోహన్ నాయక్ (34)కు ఫోన్‌చేసి చెప్పాడు. అతడు వచ్చాక రాత్రి ఒంటి గంట ప్రాంతంలో ఇద్దరూ కలిసి బాలికను ముళ్ల పొదల్లోకి తీసుకెళ్లి అత్యాచారం చేశారు. బాలిక వారి వద్ద నుంచి తప్పించుకుని రోడ్డుపైకి వచ్చి కాపాడండి అంటూ పెద్దగా కేకలు వేసింది. అటుగా వెళుతున్న పాదచారులు గమనించి, బాలిక తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. ఈ ఘటనపై బాలిక తల్లి తిరుచానూరు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి, నిందితులను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. ఈ కేసు చిత్తూరులోని పోక్సో కోర్టులో సోమవారం వాయిదాకు రాగా న్యాయమూర్తి పూర్వాపరాలు పరిశీలించారు. నేరం రుజువు కావడంతో ముద్దాయిలకు బతికినంతకాలం జైలు శిక్షతోపాటు వెంకటేష్‌కు రూ.17,500, రాజామోహన్ నాయక్‌కు రూ.13,500 జరిమానా విధించారు. బాధితురాలికి రూ.3లక్షల నష్టపరిహారం ప్రభుత్వం చెల్లించాలని న్యాయమూర్తి శంకర్‌రావు తీర్పునిచ్చారు. ఈ కేసును స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ మోహనకుమారి కేసును వాదించారు.

రూ.47లక్షల ఎరువుల అమ్మకాలు నిలుపుదల

పులివెందుల రూరల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): పులివెందుల పరిధిలోని ఎరువుల దుకాణాల్లో వ్యవసాయశాఖ, పోలీస్, విజిలెన్స్ శాఖలు సంయుక్తంగా సోమవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా యూరియా, డీఏపీ, ఎంఓపీ, కాంప్లెక్స్ ఎరువులకు సంబంధించిన అమ్మకాలు కొనుగోలు వివరాలు, యూరియాకు సంబంధించిన స్టాక్ వివరాలు, రసీదులను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పులివెందుల ఏడీఏ అంబవరం ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఏడు దుకాణాలలో పలు లోపాలను గుర్తించామన్నారు. సుమారు రూ.47 లక్షల విలువైన వివిధ రకాల ఎరువుల అమ్మకాలను నిలుపుదల చేశామ న్నారు. కార్యక్రమంలో సీఐ రమణ, ఏఓ చెన్నారెడ్డి, టెక్నికల్ ఏఓ సునీల్ కుమార్‌రెడ్డి, విజిలెన్స్‌శాఖ హెడ్‌కానిస్టేబుల్ రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు విరివిగా రుణాలు ఇవ్వాలి



మాట్లాడుతున్న ఆప్కాబ్ చైర్మన్ వీరాంజనేయులు

కడప రూరల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) రైతులకు విరివిగా అన్ని రకాల రుణాలు అందించి తద్వారా ప్రభుత్వ లక్ష్యసాధనకు తోడ్పాటు అందించాలని ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు పేర్కొన్నారు. సోమవారం ఆయన డీసీసీ బ్యాంకును ఆకస్మికంగా సందర్శించారు. సీనియర్ అధికారులు, బ్యాంకు సిబ్బందితో మాట్లాడి బ్యాంకు స్థితిగతులను తెలుసుకున్నారు. అనంతరం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆప్కాబ్ తరుపున డీసీసీ బ్యాంకు కు అన్ని రకాల ప్రయోజనాలు చేకూరుస్తామని... జిల్లా రైతాంగానికి అండగా నిలవాలన్నారు. అందుకు ఎన్ని కోట్లు రుణాలు కావాలన్నా మంజూరు చేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ఉద్యోగ సమస్యలను కూడా పరిష్కరిస్తామన్నారు. సమావేశంలో డీసీసీబీ చైర్మన్ ఎం.సూర్యనారాయణరెడ్డి, సీఈవో రాజామణి, డీజీఎం ప్రతాప్‌రెడ్డి, ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు నారాయణరెడ్డి, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

చెస్ పోటీల్లో సత్తాచాటిన కడప క్రీడాకారులు



చెస్‌లో సత్తాచాటిన జిల్లా క్రీడాకారులు

కడప స్పోర్ట్స్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లా వెంకటగిరిలో ఈనెల 24న జరిగిన ఆలిండియా వన్‌డే ఓపెన్ చెస్ టోర్నమెంటులో కడపకు చెందిన చెస్ క్రీడాకారులు సత్తాచాటినట్లు జిల్లా చెస్ సంఘం కార్యదర్శి అనీస్‌దర్బారి వెల్లడించారు. ఇందులో దేశం నలుమూలల నుంచి సుమారు 265 మంది చెస్ క్రీడాకారులు పాల్గొన్నారని తెలిపారు. వారిలో జిల్లాకు చెందిన 23 మంది చెస్ క్రీడాకారులు పాల్గొని అండర్-14 బాలికల విభాగంలో సరయూ ద్వితీయ స్థానం సాధించగా, అండర్-12 విభాగంలో లక్ష్మి 3వ స్థానం, అండర్-8 బాలుర విభాగంలో అర్జున్ తృతీయ స్థానం, అండర్-10 బాలికల విభాగంలో అమీనా నాలుగోస్థానం, మహిళల విభాగంలో సబీహ 4వ స్థానం, ఓపెన్ విభాగంలో భగత్ 13వ స్థానం సాధించినట్లు తెలిపారు.

అట్టహాసంగా జిల్లాస్థాయి యోగా ఎంపిక పోటీలు



యోగ పోటీలకు హాజరై ప్రశంసాపత్రాలు అందుకున్న విద్యార్థులు తదితరులు

వేంపల్లె, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): వేంపల్లెలో జిల్లాస్థాయి యోగా ఎంపిక పోటీలు అట్టహాసంగా జరిగాయి. జిల్లా యోగా అసోషయేషన్ అధ్యక్షుడు అనిల్, కార్యదర్శి తేజ ఆధ్వర్యంలో స్థానిక శ్లోక హైస్కూల్‌లో సోమవారం ఈ పోటీలు జరిగాయి. జిల్లాలోని కడప, పులివెందుల, తొండూరు, వేంపల్లె, ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీ తదితర ప్రాంతాల నుంచి పలువురు ఈ యోగా పోటీల్లో పాల్గొన్నారు. 70 మందికి పైగా ఈపోటీల్లో పాల్గొనగా పలువురు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఆయా వయసు గ్రూపులలో ఈ పోటీలు జరగ్గా విజేతలుగా నిలిచిన వారిని సెప్టెంబరు 6,7 తేదీల్లో తూర్పు గోదావరి జిల్లా ద్వారకా తిరుమలలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని అధ్యక్ష, కార్యదర్శులు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ కుమారస్వామి గుప్త, శ్లోక కరస్పాండెంట్ నవనీశ్వర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సురేంద్ర చేతులమీదుగా విజేతలకు ప్రశంసాపత్రాలను అందించారు. పరిశీలకులు మనోహర్‌రెడ్డి, రెఫరీ కేశవ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌వీఅండ్‌ఎస్ఎస్‌డబ్ల్యుఏ వర్కింగ్ ప్రెసిడెంటుగా రవి



కడప మారుతీనగర్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): స్టేట్ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ స్టాఫ్ వెల్ఫేర్ అసోసియేషన్ (ఎస్‌వీఅండ్‌ఎస్ ఎస్‌డబ్ల్యుఏ) నూతన వర్కింగ్ ప్రెసిడెంటుగా కడప డిపోలో విధులు నిర్వహిస్తున్న ఆర్టీసీ కానిస్టేబుల్ గుండ్లకొండ రవి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టేట్ విజిలెన్స్ విభాగంలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించేం దుకు కృషి చేస్తానని వెల్లడించారు.

గల్లంతైన యువకుడి శవం లభ్యం

దువ్వూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జిల్లేళ్ల గ్రామానికి చెందిన నాదేళ్ల షఫిక్ (15) మృతదేహం సోమవారం తెల్లవారు జామున లభ్యమైంది. ఆదివారం కేసీ కాలువలో పడి షఫిక్ గల్లంతు అయిన విషయం విధితమే. మృతదేహం కోసం ఎంత వెతికినా కనిపించలేదు. ఈ నేపథ్యంలో పోలీసులు కేసీ అధికారులతో మాట్లాడి కాలువలో నీటిమట్టాన్ని తగ్గింపజేశారు. దీంతో ఏకోపల్లె సమీపంలో మృతదేహాన్ని గుర్తించి బయటికి తీశారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా, మృతి చెందిన షఫిక్ దువ్వూరు జడ్పీ హైస్కూలులో 10వ తరగతి చదువుతున్నాడు. సంఘటన గురించి తెలిసిన స్నేహితులు, ఉపాధ్యాయులు విషాదంలో మునిగిపోయారు. షఫిక్ మృతితో గ్రామంలో విషాధచాయలు అలుముకున్నాయి.

దాడి ఘటనపై పరస్పర ఫిర్యాదు

పులివెందుల, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): పులివెందుల పట్టణంలో సోమవారం ఉదయం 10గంటల ప్రాంతలో జరిగిన ఘటనలో ఇరువురు పరస్పర ఫిర్యాదులు చేసుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. సోమవారం ఉదయం ఓ ఎలక్ట్రికల్ షాప్‌లో ఉన్న తనపై దాడి చేశారని పులివెందులకు చెందిన సుంకేసుల ఆదిశేష అనే వ్యక్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇటీవల జరిగిన జడ్పీటీసీ ఎన్నికలలో వైసీపీ తరపున ప్రచారం ఎందుకు నిర్వహించావని దూషిస్తూ తనపై ఆర్.తుమ్మలపల్లెకు చెందిన విశ్వనాథరెడ్డి, అతని అనుచరుడు తనపై దాడి చేశారని, ఈ ఘటనలో తన ఎడమ చేయి విరిగిందని ఆదిశేష తెలిపారు. దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశానన్నారు. అలాగే సొంత పనిపై ఎలక్ట్రికల్ షాపునకు వెళ్లానని టీడీపీ నాయకుడు విశ్వనాథరెడ్డి అనుచరుడు మల్లెం శేఖర్ అనే వ్యక్తి తెలిపారు. అయితే ఆదిశేష తనను కులంపేరుతో దూషించాడని... ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేశానని తెలిపారు. ఆదిశేషపై చర్యలు తీసుకోవాలని మల్లెం శేఖర్ పోలీసులకు ఫిర్యాదు పత్రాన్ని అందించారు. ఈ పరస్పర ఫిర్యాదులుపై కేసు నమోదు వివరాలు తెలుసుకునేందుకు అర్బన్ సీఐ చాంద్‌బాషకు ఫోన్ చేయగా ఆయన అందుబాటులోకి రాలేదు.

సిద్ధేశ్వరస్వామి ఆలయ భూముల రిపోర్టును రద్దు చేయాలి



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న కలమల్ల గ్రామస్థులు

ఎర్రగుంట్ల, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): కలమల్లలో వెలసిన సిద్దేశ్వరస్వామి ఆలయ మాన్యం భూముల విషయంలో త్రిసభ్య కమిటీ నివేదికను రద్దు చేయాలని కలమల్ల గ్రామానికి చెందిన సిద్దేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్ ఇల్లూరు రామప్రసాద్‌రెడ్డి, తారక రామారెడ్డి, గ్రామప్రజలు సోమవారం కలెక్టర్‌కు వినతి పత్రం ఇచ్చారు. సిద్దేశ్వరస్వామి ఆలయం 1943 నుంచి వుందని, ఆలయానికి 61.50 ఎకరాల భూమి ఉందన్నారు. ఆలయాన్ని ఆర్టీపీపీ నిర్మాణ దశలో పునర్నిర్మాణం చేశారన్నారు. అయితే గ్రామానికి చెందిన ఓ వర్గం వారు ఆలయానికి పేరు మార్చి అసత్యాన్ని సత్యంగా చూపించే ప్రయత్నం చేశారన్నారు. ఈ ఆలయాలకు సంబంధించి ఆర్డీవో, తహసీల్దార్, ఎండోమెంట్ ఏసీని రిపోర్టు ఇమ్మని కలెక్టర్ కోరారని... అయితే వారు గ్రామ ప్రజలందరితో సమావేశం నిర్వహించకుండా పూర్వ రికార్డులు పరిశీలించకుండా ఏకపక్షంగా రిపోర్టును ఇచ్చారన్నారు. గ్రామంలో 1992లో సంవత్సరంలో వీరభద్ర సహిత ఉమామహేశ్వరస్వామి ఆలయంగా రిజిస్ట్రేషన్ చేసుకున్న వారే ఇప్పుడు ఇదే సిద్ధేశ్వరస్వామి ఆలయం అంటూ మసిపూసి మారేడుకాయ చేశారని ఆరోపించారు. వెంటనే వారిచ్చిన రిపోర్టును వెంటనే రద్దు చేయాలన్నారు.

సహకారశాఖలో పదోన్నతులు

కడప ఎన్టీఆర్ సర్కిల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): సహకార శాఖలో పలువురికి పదోన్నతులు లభించాయి. రాజంపేట డివిజనల్ కోఆపరేటివ్ ఆఫీసులో పనిచేస్తున్న అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఎం.గోపిక్రిష్ణకు కడప డివిజనల్ కోఆపరేటివ్ ఆఫీ సరుగా పదోన్నతి కల్పించారు. అలాగే బద్వేలు సబ్ డివిజనల్ కో ఆపరేటివ్ ఆఫీసరుగా పనిచేస్తున్న వైఎస్ సి.సత్యానందంను ప్రొద్దుటూరు డివిజనల్ కోఆపరేటివ్ ఆఫీసరుగా పదోన్నతిపై నియ మించారు. ప్రొద్దుటూరు అసిస్టెంటు రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న బ్రహ్మానందరెడ్డికి పదోన్నతి కల్పించి డిస్ట్రిక్ట్ కోఆపరేటివ్ ఆడిట్ ఆఫీసరుగా నియమించారు.

ప్రశాంతంగా డాక్టర్ వైఎస్సార్ ఏఎఫ్‌యూ ప్రవేశాల కౌన్సెలింగ్

కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ వైఎస్సా ర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీలో జరిగిన బీఎఫ్ఏ ఫోర్ ఇయర్స్ డిగ్రీ ఫైన్ ఆర్ట్స్ (యానిమేషన్, అప్లై డ్ ఆర్ట్, పెయింటింగ్, ఫొటోగ్రఫీ, శిల్పం మరియు బి.డిజైన్ ఇంటీరియర్ డిజైన్) కోర్సులకు కౌన్సెలింగ్ ప్రశాంతంగా జరిగింది. 70శాతం విద్యార్థులు హాజరై, డాక్టర్ వైఎస్సార్ ఏఎఫ్‌యూ వీసీ డాక్టర్ జి.విశ్వనాథ్ కుమార్ చేతుల మీదు గా విద్యార్థులు సీట్ అలాట్‌మెంట్ పొందారు. అదేవిధంగా బిఎఫ్ఏ/బి డిజైన్ కోర్సులకు 2వ దశ కౌన్సెలింగ్ సెప్టెంబరు 3న నిర్వహించబడునన్నారు.

కోనేరు రంగారావు కమిటీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌పై విచారణ

- పది రోజుల్లో సంజాయిషీ చెప్పాలని నోటీసులు

కలికిరి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా కలెక్టరు కార్యాలయంలో కోనేరు రంగారావు కమిటీ (కేసీసీ) స్పెషల్ డిప్యూటీ కలెక్టరుగా విధులు నిర్వహిస్తున్న మణిపాటి రామసుబ్బయ్యపై ప్రభుత్వం విచారణకు ఉపక్రమించింది. ఈ మేరకు పది రోజుల్లో ఆరోపణలపై వివరణ ఇవ్వాల్సిందిగా ఆదేశిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. స్పెషల్ డిప్యూటీ కలెక్టరు రామసుబ్బయ్య నంద్యాల గాలేరు-నగరి సుజల స్రవంతి ప్రాజెక్టులో భూసేకరణ కోసం పనిచేస్తున్న 2020-2022 మధ్య తీవ్రమైన అవకతవకలకు పాల్పడినట్లు ప్రభుత్వం ఆరోపించింది. ఈ మేరకు ఏసీబీ డైరెక్టర్ జనరల్ ప్రభుత్వానికి అందజేసిన నివేదిక మేరకు తగు చర్యలు తీసుకునే ముందు రామసుబ్బయ్య నుంచి వివరణ కోరింది. 1987లో జూనియర్ అసిస్టెంటుగా ఉద్యోగంలో చేరి అనంతరం పదోన్నతులు పొంది అనంతపురం జిల్లా కదిరి ఆర్డీవోగా 2020 వరకూ పనిచేశారు. అనంతరం స్పెషల్ డిప్యూటీ కలెక్టరుగా జీఎన్ఎస్ఎస్ భూసేకరణ విభాగంలో పనిచేసేటప్పుడు వెలుగులోకి వచ్చిన పలు అభియోగాలపై ఏసీబీ దర్యాప్తు జరిపింది. 41 మంది రైతులకు చెందిన డీకేటీ భూములకు పరిహారం చెల్లించకుండా వాయిదాలు వేస్తూ వచ్చారని రైతులు ఆరోపించారు. చివరికి మొత్తం భూములకు చెల్లించాల్సిన రూ.90 లక్షల పరిహారంలో పది శాతం తనకు చెల్లించాలని రామసుబ్బయ్య పట్టుబట్టారని రైతు ల ప్రధాన ఆరోపణ. దీనికిగానూ మొదటి విడతగా రూ.1.50 లక్షలు విడ తల వారీగా రైతులు చెల్లించారు. మధ్యలో డబ్బు కోసం వత్తిడి పెరగడంతో వారు నేరుగా ఏసీబీ అధికారులకు, జిల్లా కలెక్టరుకు ఫిర్యాదులు చేశారు. ఫోన్‌పే ద్వారా ఆయన సహాయకుడికి చేసిన డబ్బుల చెల్లింపులు, వాయిస్ కాల్ రికార్డులు ఏసీబీకి లభ్యమయ్యాయి. దీంతో లోతుగా దర్యాప్తు జరిపిన ఏసీబీ సుబ్బరామయ్యపై 2024లో తీవ్రమైన అభియోగాలు నమోదు చేసింది. ఈ మొత్తం వ్యవహారంపై సుదీర్ఘమైన అంశాలను పొందుపరిచిన ఏసీబీ నివేదిక మేరకు విచారణకు సిద్ధమైన ప్రభుత్వం ప్రాథమికంగా సుబ్బరామయ్యకు సోమవారం నోటీసులు జారీ చేసింది. నోటీసులతో పాటు 33 మంది నుంచి తీసుకున్న వాంగ్మూలాలను, రాతమూలకమైన ఫిర్యాదులను కూడా విచారణ కోసం సుబ్బరామయ్యకు జారీ చేసిన నోటీసులకు జత చేస్తూ రెవెన్యూ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జి.జయలక్ష్మి సోమవారం ఆదేశాలు జారీ చేశారు.

29న మండల సర్వసభ్య సమావేశం

రామాపురం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయం సభాభవనంలో ఈనెల 29న మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో జాషువా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో మండలంలోని అన్నిశాఖల్లో జరుగుతున్న అభివృద్ధి పనులపై సమీక్ష జరుగుతుందని పేర్కొన్నారు. ఆయా శాఖల మండల స్థాయి అధికారులు తమ నివేదికలతో సమావేశానికి రావాలన్నారు. ఈ సమావేశానికి జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, మండల కోఆప్షన్ మెంబర్, సచివాలయ కార్యదర్శులు తప్పక హాజరుకావాలని కోరారు.

ఆక్రమణలకు పాల్పడితే చర్యలు

చిట్వేలి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆస్తులను ఆక్రమణలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని చిట్వేలి పంచాయతీ కార్యదర్శి కె.రామసుబ్బారెడ్డి అన్నారు. ఈ మేరకు సోమవారం స్థానిక చిట్వేలి పంచాయతీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. చిట్వేలి గ్రామ పంచాయతీకి చెందిన వైఎస్ఆర్ సర్కిల్ సత్యమ్మ వీధి వద్ద ఉన్న మోటారు షెడ్డును కొందరు సత్యమ్మవీధి ప్రజలు జేసీబీ సహాయంతో కూల్చివేశారన్నారు. నిందితులపై తగిన చర్యలు తీసుకోవాలని ఆయన పోలీసులకు విజ్ఞప్తి చేశారు.

రేపు గణనాథుని కల్యాణం



రాజంపేట, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని బోయనపల్లె సమీపంలో ఇసుకపల్లె రోడ్డులో వెలసిన వినాయకస్వామి ఆలయంలో వినాయకచవితి సందర్భంగా బుధవారం గణనాథుని కల్యాణం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం 8 గంటలకు పంచామృతాభిషేకం, నేతి కుడుములతో గణపతి హోమం, పూర్ణాహుతి, అలాగే సాయంత్రం సిద్ధి బుద్ధి సహిత గణపతి కల్యాణాన్ని వైభవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు విశేషంగా తరలివచ్చి స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

వరుస చోరీలతో బెంబేలు



సీసీ పుటేజీలో నమోదైన దుండగుల దృశ్యాలు

- మాధవరం-1 పంచాయతీలో దొంగల రెక్కీ
- కేసుల్లో రికవరి సాధించని పోలీసులు
- భయాందోళనలో ప్రజలు

సిద్దవటం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): సిద్దవటం మండలం మాధవరం-1 గ్రామపంచాయతీలోని ఎస్‌కేఆర్ నగర్, బంగారుపేటలో జరుగుతున్న వరుస చోరీలతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఆదివారం ఒక్కరోజులోనే ఐదు గృహాల్లో దొంగతనాలు చోటు చేసుకోవడం గమనార్హం. రెక్కీ నిర్వహించి రాత్రి చోరీలకు పాల్పడుతూ ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నారు. రాత్రి వేళల్లో పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తున్నా చోరీలు మాత్రం ఆగడం లేదని ప్రజలు వాపోతున్నారు. దొంగలు తాళం వేసిన ఇళ్లను ఎంచుకుని నగదు, బంగారం, వెండి ఆభరణాలు దోచుకెళుతున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరుస దొంగతనాల నేపథ్యంలో సీసీ కెమెరాల ఏర్పాటు అనివార్యంగా మారిందని మరికొందరు చెబుతున్నారు. ఎస్‌కేఆర్ నగర్‌కు చెందిన శ్రీరామదాసు వెంకటరమణ, బొడిచెర్ల వెంకటేశ్వర్లు, జొన్నాదుల వెంకటసుబ్బయ్య గృహాల్లో చోరీ జరిగింది. అలాగే బంగారుపేటలో నూకల వెంకటసుబ్బయ్య గృహంలో 10 తులాల బంగారం, రూ.2 లక్షల నగదును దోచుకెళ్లారు. కె.నరసమ్మ గృహంలో ఆదివారం తెల్లవారుజామున చోరీ జరిగింది. గుర్తు తెలియని నలుగురు దుండగులు ఐదు గృహాల్లో చోరీకి పాల్పడినట్లు సమాచారం. నలుగురు దుండగులకు సంబంధించిన దృశ్యాలు సీసీ పుటేజీలో నమోదైనట్లు తెలుస్తోంది. బంగారుపేటకు నూకల వెంకటసుబ్బయ్య గృహంలో జరిగిన చోరీ ఘటనకు సంబంధించి పోలీసులకు పిర్యాదు చేశారు. ఈ మేరకు సిద్దవటం ఎస్ఐ మహమ్మద్‌రఫీ, పోలీసులు ఘటన స్థలానికి వెళ్లి విచారణ చేశారు. ఇప్పటివరకు మాధవరం-1 గ్రామ పంచాయతీలో నమోదైన చోరీ కేసులో రికవరీ సాధించకపోవడంపై ప్రజలు భయాందోళనకు గురువుతన్నారు. ఇప్పటికైనా పోలీసు ఉన్నతాధికారులు స్పందించి చోరీలను అరికట్టాలని కోరుతున్నారు.



నూకల వెంకటసుబ్బయ్య గృహంలో చోరీ జరిగిన దృశ్యం



ఎంపీడీవో కార్యాలయంలో ప్రారంభించిన ఆధార్ సేవలు

ఒంటిమిట్టలో ఆధార్ సేవలు

ఒంటిమిట్ట, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన ఒంటిమిట్టలో ఆధార్‌సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఇప్పటివరకు ఆధార్ కేంద్రం లేకపోవడంతో మండలవాసులు ఇబ్బందులు పడ్డారు. ఆధార్ సేవల కోసం కడపకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో కడపలోని ఆధార్ కేంద్రాల వద్ద కాపు కాసినా పని జరిగేది కాదు. ఇలాంటి ఇబ్బందులు గురవుతున్న మండలవాసులకు ఒంటిమిట్టలో ఆధార్ కేంద్రం ఏర్పాటు శుభపరిణామం. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఆధార్ కేంద్రాన్ని అధికారులు ప్రారంభించారు. నేటినుంచి మండలంలో ఆధార్ సేవలు కొనసాగుతాయని తెలిపారు. కావున మండలంలోని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు.

ఒంటిమిట్టలో వీధిలైట్లకు మరమ్మతులు

ఒంటిమిట్ట, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన ఒంటిమిట్టలో వీధిలైట్లకు మరమ్మతులు చేసినట్లు పంచాయతీ కార్యదర్శి సుధాకర్ తెలిపారు. వీధిలైట్లు పాడైనచోట మరమ్మతులు చేశామని, పూర్తిగా పాడైనచోట కొత్తవాటిని ఏర్పాటు చేశామన్నారు. ఇంకా ఏ వీధిలోనైనా వీధి లైట్లు వెలగకపోతే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. వెంటనే మరమ్మతులు చేసి కొత్తవాటిని ఏర్పాటు చేస్తామన్నారు.

రాజంపేటను జిల్లాగా ప్రకటించాలి

- జిల్లా సాధన సమితి సభ్యులు

రాజంపేట టౌన్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): రాజంపేట పార్లమెంట్ ప్రజల మనోభావాలను గుర్తించి రాజంపేటను జిల్లాగా ఏర్పాటు చేయాలని జిల్లా సాధన సమితి సభ్యులు కోరారు. సోమవారం పట్టణంలోని ఆర్ అండ్ బీ అతిథి గృహం ఆవరణంలో భవిష్యత్ కార్యచరణపై సమావేశం నిర్వహించారు. గత ప్రభుత్వం రాష్ట్ర విధ్వంసంలో భాగంగా స్వార్థ ప్రయోజనాల కోసం ఈ ప్రాంతవాసుల మనోభావాలకు వ్యతిరేకంగా జిల్లాను అడ్డుగోలుగా విభజన చేశారని ధ్వజమెత్తారు. ఎన్నికల సమయంలో చంద్రబాబునాయుడు, పవన్‌కళ్యాణ్ రాజంపేటను జిల్లాగా ప్రకటిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. రాజకీయాలకు అతీతంగా జిల్లా సాధన సమితిలో ప్రతిఒక్కరు పాలు పంచుకుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో పూల భాస్కర్, గీతాంజలి రమణ, ఫ్యూచర్ మైండ్స్ నందగోపాల్, ఉద్దండపు సుబ్రమణ్యం, పోతుగుంట నాగేశ్వరరావు, జవ్వాజి మోహన్, సుదర్శన్, విద్యార్థి సంఘం నాయకులు నాగేశ్వర్‌రావు, రమణనాయుడు, రఘుపతినాయుడు, పోకల ప్రభాకర్, మహదేవయ్య, విద్యార్థులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కేంద్రంగా చేయడమే లక్ష్యం

- కూటమి నాయకులు

రాజంపేట, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): రాజంపేటను జిల్లా కేంద్రంగా చేయడమే తమ లక్ష్యమని కూటమి నాయకులు ప్రముఖ న్యాయవాది టి.లక్ష్మీనారాయణ, దంత వైద్యుడు నవీన్ తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ పుట్టిన గడ్డకు రుణం తీర్చుకోవాలని, భావితరాల రాజంపేట బిడ్డలకు భవిష్యత్ బంగారు బాట కావాలంటే రాజంపేటను జిల్లా కేంద్రం చేసి తీరాలన్నారు. ఈ మేరకు రాష్ట్ర మంత్రులకు ఉత్తరాలు రాస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరు తమ బాధ్యతగా తీసుకొని ఉద్యమాన్ని తీవ్రతరం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సత్ప్రవర్తనతో మెలగాలి

ఒంటిమిట్ట, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సత్ప్రవర్తనతో మెలగాలని, అప్పుడే అనుకున్న గమ్యాన్ని చేరుకుంటారని జిల్లా ప్రాజెక్టు చైల్డ్ అభివృద్ధి అధికారి వాణి అన్నారు. సోమవారం స్థానిక ఉన్నత పాఠశాలలో మిషన్ వాత్సల్య పథకం చైల్డ్ హెల్ప్‌లైన్, 1098 పైన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కౌమార పిల్లలు ఏ పని చేసినప్పటికీ ఆలోచించి చేయాలని, తొందరపడి నిర్ణయాలు తీసుకోకుండా జాగ్రత్త పడాలని వివరించారు. తొందరపాటు నిర్ణయాలతో చక్కటి భవిష్యత్‌ను నాశనం చేసుకుంటారన్నారు. కార్యక్రమంలో ఏసీడీపీవో శోభారాణి, లీగల్ కం ప్రొఫెషన్ ఆఫీసర్ సునీతారాజు, అంగన్వాడీ సూపర్‌వైజర్ సుగుణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాయచోటిలో పీజీ సెంటర్‌ను ఏర్పాటు చేయాలి

రాయచోటిటౌన్, ఆగస్టు25(ఆంధ్రజ్యోతి): రాయచోటిలో యోగివేమన యూనివర్సిటీ (వైవీయూ) అనుబంధ పీజీ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని ఆర్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఓబులేసు యాదవ్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన రాయచోటి పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల వద్ద విద్యార్థులతో కలిసి కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైవీ యూనివర్సిటీ ఏర్పాటు చేసి 20 సంవత్సరాలు అవుతున్నా ఇంకా అభివృద్ధిలో వెనుకబడి ఉందన్నారు. పరిశోధనలు, బోధనల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పేరు ప్రఖ్యాతలు వైవీయూకు ఉన్నా నిధులలేమి కారణంగా ప్రముఖ యూనివర్సిటీల స్థాయిలో నిలబడలేకపోతోందన్నారు. అప్పట్లో సర్ సీవీ రామన్ సైన్స్ బిల్డింగ్, పరీక్షల విభాగ భవనం, హాస్టల్ భవనాలు, గెస్ట్ హౌస్ రూ.70 కోట్లతో పూర్తికాగా మిగతా రూ.30 కోట్ల నిధులు అప్పటి అధికారుల నిర్లక్ష్యంతో వెనక్కు వెళ్లాయన్నారు. దీంతో అర్ధాంతరంగా మేనేజ్మెంట్ బిల్డింగ్‌లు, ప్రహరీ గోడ నిర్మాణ దశలో ఆగిపోయాయన్నారు. ఈ 20సంవత్సరాల్లో మిగతా యూనివర్సిటీలకే అధిక నిధులు కేటాయించారని, కానీ వైవీయూను పట్టించుకోలేదన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

జనావాసంలోకి నెమలి



ఫారెస్టు ప్రొటక్షన్ వాచర్‌కు నెమలిని అప్పగిస్తున్న హోంగార్డు

నందలూరు, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ అరవపల్లెలోని శ్రీకృష్ణా గీతామందిరం సమీపంలో ఉన్న ఓఇంటి పైకప్పులోని చిన్న సందులోకి సోమవారం రాత్రి నెమలి ప్రవేశించింది. ఈ విషయాన్ని గమనించిన స్థానికులు పోలీసులు, ఫారెస్టు సిబ్బందికి సమాచారం అందించారు. దాదాపు గంటసేపు శ్రమించి స్థానికుల సహాయంతో నెమలిని పట్టుకున్నారు. అనంతరం ఆ నెమలిని హోంగార్డు శ్రీనివాసరాజు ఫారెస్టు ప్రొటక్షన్ వాచర్ విజయభాస్కర్‌రెడ్డి అందజేయగా ఆయన నెమలిని రాజంపేట అటవీ కార్యాలయానికి తీసుకెళ్లారు.

పంచాయతీ కార్మికులకు పెండింగ్ జీతాలు అందించాలి



డీపీవో రాధమ్మకు వినతిపత్రం అందిస్తున్న పంచాయతీ కార్మిక సంఘం నేతలు

రాయచోటిటౌన్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా గ్రామ పంచాయతీ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న ఐదు నెలల వేతనాలు ప్రభుత్వం వెంటనే ఇవ్వాలని పంచాయతీ కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్రామయ్య డిమాండ్ చేశారు. సోమవారం రాయచోటి పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో పంచాయతీ కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈఎస్ఐ, పీఎఫ్ చెల్లించకుండా నిర్లక్ష్యం వహిస్తున్న అధికారుల మీద చర్యలు తీసుకోవాలన్నారు. గ్రీన్ అంబాసిడర్లకు ప్రభుత్వ జీవో 75 ప్రకారం రూ.6 వేలు వేతనం, 4 వేలు హెల్త్ అలవెన్స్ కలిపి రూ.10 వేలు ప్రతి నెల 5వ తేదీన చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా ప్రధాన కార్యదర్శి సురేంద్రబాబు మాట్లాడుతూ బ్యాంకుల ద్వారా వేతనాలు ఇవ్వాలని, మేజర్ పంచాయతీల్లో పనిచేసే కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని కోరారు. అనంతరం జిల్లా పంచాయతీ అధికారి రాధమ్మకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్మిక సంఘం నాయకులు దేవరాయలు, రమణ, అంజి, హరి, మురళి, రెడ్డెయ్య, గంగులు, కార్మికులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్, అప్రోచ్‌రోడ్డు నిర్మాణానికి స్థల పరిశీలన



సిద్దవటం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): కడప నగరానికి నీటి కొరత తీర్చేందుకు అదనంగా మరో పంపుహౌస్‌కు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు, అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించినట్లు తహసీల్దారు ఆకుల తిరుమలబాబు తెలిపారు. మండలంలోని లింగంపల్లెలో సోమవారం ఆయన స్థలాలను పరిశీలించారు. లింగంపల్లె పెన్నానది నుంచి పంప్ హౌస్ ద్వారా కడప నగరానికి తాగునీరు సరఫరా అవుతుందన్నారు. ప్రస్తుతం సరఫరా అయ్యే నీరు సరిపడకపోవడంతో అదనంగా మరో పంప్‌హౌస్‌ను పెన్నానదిలో నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో కలెక్టర్, ఎమ్మెల్యే ఆదేశాల మేరకు స్థలాన్ని పరిశీలిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ సోమశేఖర్, ఆర్ఐ ప్రసాద్, వీఆర్వో తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వీరభద్రుడి పల్లకీ ఉత్సవం

రాయచోటిటౌన్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణంలోని భద్రకాళీ సమేత వీరభద్రాలయంలో సోమవారం పల్లకీ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వీరభద్రస్వామి, భద్రకాళీ అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను వివిధ రకాల పుష్పాలు, పట్టువస్త్రాలతో అలంకరించారు. వేద మంత్రాల మధ్య బ్యాండు మేళాలతో ఆలయం చుట్టూ మాఢవీధుల్లో స్వామివారి ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ భక్తులతో పాటు కన్నడ భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం అర్చకులు పల్లకీ ఉత్సవ విశిష్టత గురించి భక్తులకు వివరించి తీర్థప్రసాదాలు అందజేశారు.



ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలతో పర్యావరణ కాలుష్యం : కలెక్టర్



పోస్టర్లు విడుదల చేస్తున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి(నేతాజీ సర్కిల్), ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (పీవోపీ) విగ్రహాలు చెరువులు, కుంటల్లోని నీటిలో కరగడం వల్ల పర్యావరణం కాలుష్యమవుతోందని కలెక్టర్ చామకూరి శ్రీధర్ తెలిపారు. పర్యావరణ హితం కోసం మట్టి విగ్రహాల వినియోగాన్ని ప్రోత్సహిస్తూ స్థానిక కాలుష్య నియంత్రణ మండలి ప్రాంతీయ కార్యాలయంలో ఆయన కడప పర్యావరణ ఇంజనీర్ సుధాతో కలిసి ప్రత్యేక పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మట్టి విగ్రహాల వినియోగంతో పర్యావరణం కాపాడువచ్చునని తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, డీఆర్వో మధుసూదన్‌రావు, ఆర్డీవో శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్ రవి, తదితరులు పాల్గొన్నారు.

భక్తిభావంతో పండుగ జరుపుకోవాలి

నందలూరు, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): వినాయకచవతి పండుగను భక్తిభావంతో పండుగ జరుపుకోవాలని సీఐ బీవీ రమణ తెలిపారు. వినాయకచవితి పండుగను దృష్టిలో ఉంచుకుని సోమవారం స్థానిక పోలీసుస్టేషన్ ఆవరణంలో పీస్ కమిటీ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పండుగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, ట్రాఫిక్ అంతరాయం లేకుండా ఉత్సవ కమిటీలు పటిష్ఠ చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ మల్లికార్జునరెడ్డి, ఎలక్ట్రిక్ ఏఈ సుబ్రమణ్యం, ముస్లిం మతపెద్దలు, వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రహదారులకు అడ్డంగా ఏర్పాటు చేయరాదు

రాజంపేట టౌన్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసే మండపాలను రహదారికి అడ్డంగా నిర్మించరాదని సీఐ నాగార్జున తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ వినాయక విగ్రహాల మండపాలను ఏర్పాటు చేసే కమిటీలు తప్పనిసరిగా పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. మండపాల వద్ద అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. అలాగే నిమజ్జన సమయాలను పోలీసులకు తప్పనిసరిగా తెలపాలన్నారు.

ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి

పెనగలూరు, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): మండల ప్రజలు వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్ఐ బి.రవి ప్రకాష్‌రెడ్డి, తహసీల్దారు సూచించారు. సోమవారం స్థానిక పోలీసుస్టేషన్ ఆవరణంలో వినాయక ఉత్సవ కమిటీ సభ్యులతో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యంగా రికార్డు డ్యాన్సులకు డీజే సౌండ్ సిస్టమ్ అనుమతి లేదన్నారు. రాత్రి 11 గంటలు దాటిన తర్వాత మైకుల శబ్దం కూడా పూర్తిగా నిలిపివేయాలన్నారు. గ్రామ ప్రజలకు ఇతరులకు అసౌకర్యం కలగకుండా ఉత్సవాలు నిర్వహించుకోవాలన్నారు. పోలీసులు సూచించిన ప్రదేశంలో మాత్రమే విగ్రహాలను నిమజ్జనం చేయాలన్నారు. సమావేశంలో విద్యుత్ ఏఈ ఆర్.ఓబుల్‌రెడ్డి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, ఏఎస్ఐలు రాముడు, నాగలక్షుమ్మ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

సుండుపల్లె, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): తమ గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని తోటమాలపల్లె ప్రజలు కోరారు. ఈ మేరకు సోమవారం వారు స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ రాజమ్మకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెద్దినేనికాలువ గ్రామ పంచాయతీ తోటమాలపల్లెలో తాగునీటి సమస్యతో అలమటిస్తున్నామని, ఎన్నిసార్లు చెప్పినా సర్పంచ్‌కు విన్నవించినా స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన ఎంపీపీ సమస్యను పరిష్కరించాలని పంచాయతీ కార్యదర్శి శ్రీనాధ్‌రెడ్డికి సూచించారు. అలాగే పంచాయతీ నిధులు రాగానే ట్యాంక్ నిర్మిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ సురేశ్‌బాబు, పంచాయతీ కార్యదర్శి శ్రీనాధ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి పార్టీలోనూ విభేదాలు సహజం

రైల్వేకోడూరు, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): ప్రతి రాజకీయపార్టీలోనూ విభేదాలు సహజమని రైల్వేకోడూరు వైస్ ఎంపీపీ, వైసీపీ సీనియర్ నాయకుడు రామిరెడ్డి ధ్వజారెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక వైసీపీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే రోజుల్లో కార్యకర్తలకు సుముచిత స్థానం కల్పిస్తామని తెలిపారు. కార్యకర్తలకు అండగా ఉంటామని తెలిపారు. కార్యకర్తలు లేనిదే నాయకుడు లేడని, చిన్న, చిన్న సమస్యలు వస్తే వాటినే పట్టుకుని వేలాడకుండా ఉండాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు, ముద్దులూరు సుబ్బరామరాజు, పంజం శ్రీవర్ధన్‌రెడ్డి, సీహెచ్ రమేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్ సమస్యలను వెంటనే పరిష్కరించాలి

రైల్వేకోడూరు, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): పీజీఆర్ఎస్‌పైనే వీఆర్వోలు దృష్టి సారించి పరిష్కరించాలని తహసీల్దార్ కోనేటి అమర్‌నాథ్ తెలిపారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాయలంలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీజీఆర్ఎస్ ఫిర్యాదుల పట్ల నిర్లక్ష్యం చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్ఐ లక్ష్మీదేవి, సర్వేయర్ బాలసుబ్రహ్మణ్యం, రోడ్లు భవనాల శాఖ డీఈ జయప్రకాష్, వీఆర్వోలు పాల్గొన్నారు.

'సేనతో సేనాని'ని విజయవంతం చేయండి

- ఎమ్మెల్యే అరవ శ్రీధర్

రైల్వేకోడూరు, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): సేనతో సేనాని అనే కార్యక్రమాన్ని కార్యకర్తలు, నాయకులు విజయవంతం చేయాలని జనసేన పార్టీ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్ తెలిపారు. సోమవారం విశాఖపట్నంలో రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌తో కలసి కార్యక్రమ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 28 నుంచి 30వ తేదీ వరకు విశాఖపట్నంలో సేనతో సేనాని కార్యక్రమం నిర్వహిస్తున్నారని, ఈ కార్యక్రమంలో జనసే పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్ కార్యకర్తలకు సూచనలు, సలహాలు, దిశానిర్దేశం చేస్తారన్నారు.



విశాఖలో మంత్రి నాదెండ్లతో కలసి ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అరవ శ్రీధర్

దానిమ్మకు వైరస్ పోటు

- నల్లగా మాడిపోయి రాలిపోతున్న కాయలు
- మందులకు లొంగని రోగం.. తోటలను వదిలేసిన రైతులు
- దానిమ్మ రైతులకు రూ.కోట్లలో నష్టం





పాత ములకలచెరువు వద్ద వైరస్‌లతో వదిలేసిన దానిమ్మ తోటలు

ములకలచెరువు / పెద్దతిప్పసముద్రం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మాయదారి వైరస్.. దానిమ్మ రైతులను నిండా ముంచి ంది. బ్లైట్, ఆంత్రా కోస్ వైరస్‌ల దెబ్బకు చెట్లలోని కాయలు నల్లగా మాడిపోయి రాలిపోతున్నాయి. ఎన్ని మందులు కొట్టినా లొంగడం లేదు. వైరస్ తగ్గకపోవడంతో ఏం చేయలేక తోటలను వదిలేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా దానిమ్మ రైతులకు కోలుకోలేని దెబ్బ తగిలింది. వాతారణంలో మార్పులు...ముసురు వానతో ఎన్నడూ లేనంతగా వైరస్ విజృంభించింది. ప్రస్తుతం మార్కెట్‌లో దానిమ్మ ధరలు బాగా ఉన్నా రైతులకు ప్రయోజనం లేకుండా పోయింది. కంటికి రెప్పలా కాపాడుకున్న తోటలు వైరస్‌ల బారిన పడి కళ్లముందే మాడిపోయి రాలిపోతుండడంతో రైతులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. వైరస్‌ల కారణంగా దానిమ్మ రైతులకు రూ.కోట్లలో నష్టం వాటిల్లింది.

తంబళపల్లె నియోజకవర్గంలోని ములకలచెరువు, బి.కొత్తకోట, పెద్దతిప్పసముద్రం, తంబళ్లపల్లె, పెద్దమండ్యం, కురబలకోట మండలాల్లో సుమారు వెయ్యి ఎకరాల్లో దానిమ్మ తోటలు ఉన్నాయి. ఎకరాకు రూ.1.50 లక్ష నుంచి రూ.1.80లక్షల వరకు ఖర్చు చేసి తోటలను సాగు చేశారు. ఈ తోటలు ప్రతి ఏటా దిగుబడి ఇస్తున్నాయి. సహజంగా ప్రతి ఏటా వేసవి తరువాత జూన్ నెల నుంచి నెల నుంచి రైతులు పూత నిలబెడతారు. పూత నిలిపేందుకు మందులు, ఎరువులు వాడాల్సి ఉంటుంది. ప్రతి ఏటా ఎకరాకు రూ.లక్షకుపైగా ఖర్చు వస్తుంది. ఎంతో ఆశతో రైతులు ఈ ఏడాది పూతను నిలిపి మందులు పిచికారి చేశారు. ఎరువులు కూడా వాడారు. తీరా కాయలు చేతికొచ్చే సమయంలో ముసురు వానలు, వాతావరణంలో మార్పుల కారణంగా దానిమ్మ తోటలు వైరస్ బారిన పడ్డాయి. అన్ని తోటలపై బ్లైట్, ఆంత్రా కోస్ వైరస్ దాడి చేశాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ రెండు వైరస్‌లు విజృంభించడంతో ప్రతి చెట్టులోని కాయలు నల్లగా మాడిపోవడంతో పాటు పగిలిపోయి రాలిపోతున్నాయి. రైతులు ఎన్ని మందులు కొట్టినా వైరస్‌లు తగ్గడం లేదు. వైరస్‌లు తగ్గకపోవడంతో కొందరు రైతులు తోటలను వదిలేశారు. ఎక్కడ చూసినా వైరస్‌ల బారిన పడ్డ తోటలే దర్శనమిస్తున్నాయి.

ధర బాగున్నా...

ప్రస్తుతం మార్కెట్‌లో దానిమ్మ ధర బాగున్నా ప్రయోజనంగా లేకుండా పోయింది. దానిమ్మ తోటలు వైరస్‌ల బారిన పడడంతో దిగుబడి ఏమాత్రం లేకుండా పోయింది. మార్కెట్‌లో టన్ను దానిమ్మ ధర రూ.లక్ష వరకు ఉంది. ఇక్కడి దానిమ్మ కాయలకు కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల్లో డిమాండ్ ఉండేది. గత ఏడాడి దానిమ్మ దిగుబడి బాగా వచ్చింది. కానీ ధర అంతంతమాత్రంగా ఉండడంతో రైతులు నష్టపోయారు. ఈ ఏడాది వైరస్‌ల కారణంగా దిగుబడి లేకపోవడంతో రైతులకు కోలుకోలేని దెబ్బతగిలింది.

సగానికి తగ్గిపోయిన తోటలు

తంబళ్లపల్లె నియోజకవర్గంలో దానిమ్మ తోటలు సగానికి తగ్గిపోయాయి. నియోజకవర్గ వ్యాప్తంగా గతంలో రెండు వేల ఎకరాల వరకు దానిమ్మ తోటలు ఉండేది. ప్రతి ఏటా పెట్టబడులు పెరుగుతుండడంతో పాటు వైరస్‌లతో నష్టాలు వస్తుడడంతో రైతులు తోటలను తొలగించడంతో సగానికి తగ్గిపోయాయి. ఇటీవల ములకలచెరువు మండలం కోటిరెడ్డిగారిపల్లె, గూడుపల్లె, పెద్ద తిప్పసముద్రం మండలం కురవవాండ్లపల్లె తదతర గ్రామాల్లో సుమారు 50 ఎకరాల దానిమ్మ తోటలను రైతులు తొలగించి ఇతర పంటలు సాగు చేస్తున్నారు. అలాగే ములకలచెరువు మండలం నాయనిచెరువుపల్లె వద్ద 10 ఎకరాల దానిమ్మ తోటను పూత నిలపకుండా వదిలేశారు.

ఉద్యాన రైతులకు వరుస దెబ్బలు

ఉద్యాన పంటలు సాగుచేస్తున్న రైతులకు వరుస దెబ్బలు తగులుతూనే ఉన్నాయి. ఈ ఏదాడి దోస సాగు చేసిన రైతులు వైరస్‌ల కారణంగా కాయలు సైజులు రాక, మచ్చలు వచ్చి దెబ్బతిని నష్టపోయారు. నియోజకవర్గంలో సుమారు 800 ఎకరాలకుపైగా దోస పంట వైరస్ బారిన పడడంతో రైతులకు తీవ్ర నష్టం వచ్చింది. అలాగే ఖర్బూజ పంట కూడా వైరస్‌ల బారిన పడింది. తాజాగా దానిమ్మ తోటలను కూడా వైరస్‌లు దెబ్బతీశాయి.

తేమ కారణంగా వైరస్

ముసురు వానలు వస్తుండడంతో తేమ శాతం అధికంగా ఉండడం వలన కాయాల్లో నల్ల మచ్చలు ఏర్పడి వైరస్ సోకుతోంది. దానిమ్మ పంటకు తక్కువ మోతాదులో నీరందించాలి. ఒక్క శాతం బోర్డు మిశ్రమాన్ని నీటిలో కలిపి పిచకారీ చేయాలి. కోతకు వచ్చే సమయంలో పంటకు రైతులు అజాక్సిస్త్రాన్ అనే క్రిమిసంహారక మందును లీటర్ నీటిలో ఒక్క గ్రాము కలిపి పిచికారీ చేస్తే ప్రయోజనం ఉంటుంది.
- భీమేశ్, ఉద్యానశాఖ అధికారి, ములకలచెరువు

మందులు కొట్టినా తగ్గలేదు



ఆరు ఎకరాల్లో దానిమ్మ సాగు చేశాను. రూ.10లక్షల వరకు ఖర్చు చేశాను. ఇప్పుడు మూడో ఏడాది పూత నిలిపాను. ప్రస్తుతం ఎకరాకు రూ.లక్ష వరకు ఖర్చు చేశాను. కాయలు చేతికొచ్చే సమయంలో గత నెలలో కురిసిన ముసురు వానతో భూమిలో తేమ ఎక్కువై బ్లైట్, ఆంత్రా కోస్ వైరస్‌లు సోకాయి. గుజరాత్ రాష్ట్రం నాసిక్ నుంచి మందులు తెప్పించి కొట్టినా ప్రయోజనం లేదు.
- కిరణ్‌కుమార్, గూడుపల్లె, ములకలచెరువు మండలం

ఎన్నడూ లేనంతగా వైరస్ సోకాయి



11 ఎకరాల్లో దానిమ్మ తోట ఉంది. నాలుగోసారి పూత నిలిపాను. వాతారణంలో మార్పులు, ముసురు వానతో గతంలో ఎన్నడూ లేనంతగా వైరస్‌లు సోకాయి. కాయలన్నీ నల్లగా మాడిపోవడంతో పాటు పగిలిపోయి రాలిపోతున్నాయి. మందులు పిచికారి చేసినా ప్రయోజనం లేదు. చేసేదిలేక తోటను వదిలేశాను. ఈ ఏడాడి దిగుబడే లేదు. మార్కెట్‌లో ధర బాగా ఉన్నా నిరాశే మిగిలింది.
- శేషారెడ్డి, పాత ములకలచెరువు

సమస్యల పరిష్కారమే ప్రభుత్వ అజెండా

మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

చిన్నమండెం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ అజెండా అని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. సోమవారం తన స్వగ్రామమైన బోరెడ్డిగారిపల్లెలో ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడికి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి తక్షణమే అక్కడికక్కడే అధికారులకు ఫోన్ చేసి సకాలంలో సమస్యలను పరిష్కరించాలని సూచించారు. అలాగే ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం పడమటికోన గ్రామం వడ్డెపల్లెలో నూతనంగా వెలసిన శివాలయంలో మంత్రి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్తలు మంత్రిని గజమాలతో ఘనంగా సత్కరించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు పాటూరు విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయ బృందం

నందలూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): రాజంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈనెల 24న జరిగిన జిల్లా స్థాయి సబ్ జూనియర్స్ బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరచిన పాటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు చమర్తి సుదర్శన్‌రాజు మాట్లాడుతూ బాల్‌బ్యాడ్మింటన్ సెలక్షన్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎం.యేసుప్రియ, ఎస్.మన్సూర్ ఎంపికయ్యారని, తమ పాఠశాల విద్యార్థులు ఎంపిక కావడం అభినందనీయమన్నారు. ఈనెల 29, 30, 31వ తేదీల్లో ప్రకాశం జిల్లాలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో పీడీ సుస్మిత, పీఈటీ జగన్, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

చక్రంపేట విద్యార్థి ...



విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

పెనగలూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చక్రంపేట ఉన్నత పాఠశాలకు చెందిన సి.గురుచరణ్ అనే విద్యార్థి రాష్ట్రస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ క్రీడా పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గోపాలకృష్ణ తెలిపారు. ఆదివారం రాజంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణంలో జరిగిన జిల్లా స్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో గురుచరణ్ రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. సోమవారం పాఠశాలలో ఉపాధ్యాయ బృందం గురుచరణ్‌ను అభినందించి జ్ఞాపిక అందజేశారు.

కలికిరి విద్యార్థిని...



విద్యార్థినిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కలికిరి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ బాలికోన్నత పాఠశాలలో తొమ్మిదవ తరగతి చదువుతున్న జి.నిత్యశ్రీ రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో పాల్గొనడానికి ఎంపికయినట్లు హెచ్ఎం జయశ్రీ తెలిపారు. ఆదివారం మదనపల్లె గ్రీన్‌వ్యాలీ స్కూల్‌లో జూనియర్ విభాగంలో జరిగిన పోటీల్లో పాల్గొన్న నిత్యశ్రీ బాలికల విభాగంలో రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించింది. సెప్టెంబరు 13, 14, 15వ తేదీల్లో నెల్లూరులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో ఈ అమ్మాయి జిల్లా తరఫున ఆడనుంది. ఈ సందర్భంగా నిత్యశ్రీకి శిక్షణ ఇచ్చిన పీడీ టి.చిన్నప్ప, విజేతగా నిలిచిన నిత్యశ్రీలను హెచ్‌ఎంతోపాటు ఉపాధ్యాయులు సోమవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో అభినందించారు.

మాదక ద్రవ్యాల నియంత్రణకు పటిష్ట చర్యలు

- **జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్**



పోస్టర్లను విడుదల చేస్తున్న జేసీ, అదనపు ఎస్పీ, తదితరులు

రాయచోటి (నేతాజీ సర్కిల్), ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మాదక ద్రవ్యాలను పూర్తి స్థాయిలో అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో మాదక ద్రవ్యాల జిల్లా స్థాయి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ మాట్లాడుతూ యువత మాదక ద్రవ్యాల బారినపడకుండా వాటి వినియోగం వల్ల కలిగే అనర్థాలపై విస్తృత అవగాహన కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఇప్పటి వరకు 530 ఉన్నత పాఠశాలల్లో ఇప్పటికే 430 ఈగల్ క్లబ్స్‌ను ఏర్పాటు చేశామని, త్వరితగతిన మిగతా స్కూల్స్‌లో పూర్తి స్థాయిలో ఈగల్ క్లబ్స్ ఏర్పాటు చేసి ప్రతి నెలా అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని డీఈవోను ఆదేశించారు. ఎక్సైజ్ శాఖ ఇంకా అవగాహన కార్యక్రమాలు పెంచాలని తెలిపారు.

మందుల షాపుల్లో డాక్టర్ రాసిన చీటీలు లేకుండా మందులు ఇవ్వరాదని, తరచూ మందుల షాపులను తనిఖీ చేయాలని డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్‌ను ఆదేశించారు. అడిషనల్ ఎస్పీ వెంకటాద్రి మాట్లాడుతూ జిల్లాలో పోలీసుశాఖ వారికి ఇప్పటికే 735 అవగాహన కార్యక్రమాలను నిర్వహించడం జరిగిందని, ఇంకా ఈ కార్యక్రమాలను పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇప్పటి వరకు 882 కేసులు పెట్టడం జరిగిందని తెలిపారు. అలాగే సీసీ టీవీ, డ్రోన్ల ద్వారా పర్యవేక్షించడం జరుగుతోందని తెలిపారు. అనంతరం పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మదనపల్లె సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డీఆర్‌వో మధుసూదన్‌రావు, రాయచోటి ఆర్డీవో శ్రీనివాస్, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ ఏఈఎస్ జోగేంద్ర, డీఎస్పీ, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు అండగా నిలవండి : ఎస్పీ



బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

రాయచోటిటౌన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చే బాధితులకు పోలీసు అధికారులు అండగా నిలవాలని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల సమస్యలను ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు స్వయంగా విన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ బాధితుల సమస్యలను చట్టపరంగా, వీలైనంత త్వరగా పరిష్కరించాల్సిన బాధ్యత ప్రతి పోలీసు అధికారిపై ఉందని తెలిపారు. ఫిర్యాదుదారులతో ప్రత్యక్షంగా మాట్లాడిన ఎస్పీ వారి సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదుల్లో ముఖ్యంగా కుటుంబ కలహాలు, సైబర్ మోసాలు, కుటుంబ సభ్యుల వేధింపులు, భూవివాదాలు, నకిలీపత్రాలు, అధిక వడ్డీలు, ఆన్‌లైన్ మోసాలు, ప్రేమ పేరుతో మోసాలు లాంటివి ఉన్నాయన్నారు. ప్రతి ఫిర్యాదుపై తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్ ద్వారా నేరుగా ఆదేశాలు జారీ చేశారు. ఫిర్యాదు దారులకు న్యాయం చేయండి, బాధితులకు బాసటగా నిలవాలని, చట్ట పరిమితుల్లో మానవీయంగా స్పందించండని ఎస్పీ సూచించారు. వృద్ధులు, వికలాంగులు, మహిళల ఫిర్యాదులకు ప్రాముఖ్యత నిస్తూ సమగ్రంగా విచారణ జరిపి త్వరితగతిన పరిష్కరించాలని స్పష్టం చేశారు.

శాంతియుతంగా జరుపుకోండి

- **జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్**

రాయచోటి (నేతాజీ సర్కిల్), ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి పండుగ శాంతియుతంగా జరుపుకోవాలని జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన వినాయక చవితి పండుగను శాంతియుతంగా సంప్రదాయబద్ధంగా నిర్వహించుకునేందుకు అడిషినల్ ఎస్పీ వెంకటాద్రి, మదనపల్లె సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణిలతో కలిసి శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ పండుగ సమయంలో అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు.

పండుగ రోజుల్లో నిరంతరం విద్యుత్ సౌకర్యాన్ని కల్పించాలని, అత్యవసర పరిస్థితుల్లో అప్రమత్తంగా ఉండాలని, ఆయా సంబంధిత అధికారులను సూచించారు. అడిషినల్ ఎస్పీ వెంకటాద్రి మాట్లాడుతూ విగ్రహాలను ఏర్పాటు చేసే ప్రాంతాల్లో రాత్రిపూట కమిటీ సభ్యులు వలంటీర్లను నియమించుకోవాలని తెలియజేశారు. సమావేశంలో డీఆర్‌వో మధుసూదన్‌రావు, రాయచోటి ఆర్డీవో శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్లు, డీపీవో, కాలుష్య నియంత్రణ మండలి సభ్యులు, వివిధ శాఖల అధికారులు, పండుగ కమిటీ ప్రతినిధులు, మత పెద్దలు పాల్గొన్నారు.

పాడి ఆవుల యజమానికి పరిహారం విడుదల

కలికిరి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): పిడుగుపాటు కారణంగా మృతి చెందిన రెండు పాడి ఆవుల యజమానికి పరిహారం విడుదల చేస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ములకలచెరువు మండలం సోంపల్లెకు చెందిన బీమిశెట్టి మస్తానప్పకు చెందిన రెండు పాడి ఆవులు ఏప్రిల్ 30న పిడుగుపాటుకు గురై మృతి చెందాయి. దీనిపై జూలై 25న కలెక్టరు పరిహారం విడుదల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. పరిశీలించిన ప్రభుత్వం రెండు పాడి ఆవులకు రూ.75 వేలు మంజూరు చేసింది. రైతు బ్యాంకు ఖాతాకు జమ చేయాలని కలెక్టరును ఆదేశిస్తూ రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి సోమవారం ఆదేశాలు జారీ చేశారు.

బార్ల దరఖాస్తుకు నేడు చివరి గడువు

రాజంపేట టౌన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట ఎక్సైజ్ శాఖ పరిధిలో ప్రభుత్వం రెండు బార్‌ల ఏర్పాటుకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఎక్సైజ్ సీఐ ఎం.మల్లిక ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బార్లు ఏర్పాటు చేసేందుకు ఆసక్తి గల వారు మంగళవారం సాయంత్రం 5 గంటల లోపు ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ ద్వారా గాని, దరఖాస్తు ప్రాసెసింగ్ ఫీజు చెల్లించి చేసుకోవచ్చునన్నారు. ఆసక్తి గలవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నీటి సంపులో పడి చిన్నారి మృతి



కురబలకోట, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): నీటి సంపులో పడి చిన్నారి మృతి చెందిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది.. దీనికి సంబంధించి బాధితులు, పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని విశ్వం కళాశాల పక్కనున్న పెద్దకటవకు చెందిన చిన్నప్పరెడ్డి, భార్గవి దంపతులు బతుకుదెరువు నిమిత్తం మూడేళ్లుగా మదనపల్లె పట్టణం బసినికొండలో నివాసం ఉండేవారు.

ఈ క్రమంలో తన కుమారుడు శ్యాంకృష్ణ(2)తో కలిసి ఈనెల 11న స్వగ్రామానికి వెళ్లారు. అయితే ఆరోజు రాత్రి ఇంటి ఆవరణలో బాలుడు ఆడుకుంటూ అనంతరం కనిపించకుండా పోయాడు. దీంతో తల్లిదండ్రులు, బంధువులు గాలించినా ఫలితం లేకుండా పోయింది. మరుసటి రోజు నీటి సంపులో బాలుడు శవమై కనిపించాడు.

ఇదిలా ఉండగా కుటుంబీకులకు తమ బిడ్డ మృతిపై అనుమానం రావడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు ముదివేడు ఎస్ఐ దిలీప్‌కుమార్ సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి చిన్నారి మృతదేహానికి అక్కడిక్కడే పోస్టుమార్టం నిర్వహించి కుటుంబీకులకు అప్పగించారు.

ఆటో కాల్చివేత



రైల్వేకోడూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓబనపల్లె దళితవాడ గ్రామం లో ఈ నెల 22న రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు కనుపర్తి రాజేంద్ర కు చెందిన ఆటోను నిప్పంటించారు. దీంతో ఆటో పూర్తిగా కాలిపోయింది. సోమవారం బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఆటోతోనే తన బతుకుదెరువు అని వాపోయాడు. తనకు గ్రామం లో ఎవరితోను శత్రుత్వం లేదన్నాడు. కానీ ఎందుకు నా ఆటోను కాల్చివేయాల్సి వచ్చిందని ఆందోళన వ్యక్తం చేశాడు. దీనిపై పోలీసులు సమగ్రంగా దర్యాప్తు చేసి తనకు న్యాయం చేయాలని కోరుతున్నాడు.

పాముకాటుకు గురైన రైతు

రైల్వేకోడూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎస్.కొత్తపల్లె గ్రామానికి చెందిన తిరుపతి చంద్రశేఖర్ అనే రైతు తన పొలంలో సోమవారం పనులు చేసుకుంటుండగా పాము కాటేసింది. దీంతో గ్రామస్తులు హుటాహుటిన రైల్వేకోడూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్య సిబ్బంది ప్రథమ చికిత్స చేసి ఎలాంటి ప్రమాదం లేదని చెప్పడంతో రైతు కుటుంబం ఊపిరి పీల్చుకుంది.

పాలకొండల్లో అటవీ అధికారుల పహారా

శ్రీగంధం తీసుకెళుతున్న ఒకరి అరెస్ట్... ఇద్దరు పరారీ



పట్టుబడిన దుంగలు, వ్యక్తితో ఫారెస్ట్ అధికారులు

సిద్దవటం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : పాలకొండ రిజర్వు అటవీ ప్రాంతంలో సోమవారం పహారా కాస్తుండగా శ్రీగంధం తీసుకెళుతున్న ఒకరిని అరెస్ట్ చేశామని, మరో ఇద్దరు పరారైనట్లు కడప రేంజర్ ప్రసాద్ తెలిపారు. భాకరాపేట సెక్షన్ సిబ్బంది, పాలకొండ రిజర్వు అటవీ ప్రాంతంలో ముగ్గురు వ్యక్తులు శ్రీగంధం దుంగలతో వెళుతూ కనిపించారన్నారు. అటవీశాఖ సిబ్బంది వారి వెంటపడగా ఇద్దరు పరారయ్యారని, ఒకరిని పట్టుకున్నట్లు తెలిపారు. పట్టుబడిన వ్యక్తి చిత్తూరు జిల్లాకు చెందిన ఎస్.విశ్వనాద్‌గా నిర్ధారించామన్నారు. పట్టుబడిన వ్యక్తిని విచారించగా పరారైనవారిలో చిత్తూరు జిల్లాకు చెందిన కొత్తకోట సురేంద్ర, చంద్ర అనే వ్యక్తులు ఉన్నారని చెప్పాడన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి నిందితుడిని కోర్టులో హాజరు పరిచామన్నారు. పరారైన నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో భాకరాపేట ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ ఎస్.శ్రీనివాసులు, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ఎస్.రాజశేఖర్‌రాజు, భాకరాపేట బీట్ ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ పి.ఇంద్ర, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ జి.కిషోర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదాన ట్రస్టుకు రూ.1.7 లక్షల విరాళం



అన్నదాన ట్రస్టు సభ్యులకు చెక్కును అందచేస్తున్న దాతలు

తంబళ్లపల్లె, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లెకు సమీపంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మల్లయ్యకొండ మల్లికార్జునస్వామి సేవా సమితి అన్నదాన ట్రస్టుకు ఓ దాత రూ.1.7 లక్షలు విరాళం అందజేశారు. సోమవారం మండలంలోని ఎర్రసానిపల్లె సర్పంచ్ సుగుణ, వీరభద్ర దంపతులు కుటుంబ సభ్యులతో కలిసి అన్నదాన ట్రస్టు వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, కార్యదర్శి నారాయణరెడ్డి, ట్రస్టు సభ్యులకు రూ.1.7లక్షల చెక్కును అందచేశారు. ఈ సందర్భంగా దాతలు మాట్లాడుతూ.. మల్లయ్యకొండకు వచ్చే భక్తుల సౌకర్యార్థం అన్నదాన ట్రస్టులో పాలు పంచుకోవడం తమ అదృష్టమన్నారు. అన్నదాన ట్రస్టు సభ్యులు, స్థానిక నాయకులు దాతల దాతృత్వాన్ని అభినందించారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు సుధాకర్‌రెడ్డి, రమణారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, మురళీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మేము దివ్యాంగులం కాదా సారూ...!

- సామాన్యులే మమ్మల్ని అవిటివారిగా గుర్తిస్తారు..
- డాక్టర్లకు ఎందుకు అనిపించలేదో...
- మాకు న్యాయం చేసి ఆదుకోండి
- ఆవేదనతో ఆందోళనకు దిగిన దివ్యాంగులు

పులివెందుల రూరల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మమ్మల్ని చూస్తూనే మేము దివ్యాంగులమని సామాన్యులు కూడా గుర్తి స్తారు.. కానీ డాక్టర్లు మాత్రం మమ్మల్ని దివ్యాంగులుగా గుర్తించ లేదు... దీంతో మా పింఛన్లు పోయాయంటూ ఆందోళనకు దిగారు. సోమవారం పులివెందుల ఆర్డీఓ కార్యాలయం ఎదుట దాదాపు 50 నుంచి 60 మంది దివ్యాంగులు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న ఆర్డీఓ చిన్నయ్య వారి వద్దకు వచ్చి ఆరా తీశారు. ఈ సందర్భంగా దివ్యాంగులు ఆర్డీఓ ఎదుట తమ ఆవేదన వెలిబుచ్చారు. సారూ మేము దివ్యాంగులమని గతంలోనే డాక్టర్లు మాకు సర్టిఫికెట్లు ఇచ్చారు. ఈ సర్టిఫికెట్లతో ప్రభుత్వం దివ్యాంగు లుగా గుర్తించి పింఛన్ అందిస్తోంది. ఈ పింఛన్ ఆగస్టు నెలలో ఇవ్వలేదు. ఎందుకు మాకు ఇవ్వలేదని ప్రశ్నిస్తే మీపేరు దివ్యాంగ పింఛన్ నుంచి తొలగించారని సచివాలయ సిబ్బంది చెప్పారు. దీంతో ఏమి చేయాలో



పులివెందుల ఆర్డీఓ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న దివ్యాంగులు

అర్థం కావడం లేదు. గత కొన్ని నెలలుగా దివ్యాంగులకు సంబంధించిన వారందరినీ డాక్టర్లు పరిశీలించి ప్రభు త్వానికి నివేదిక ఇచ్చారు. ఈ నివేదికలో మేము దివ్యాంగులం కాదని డాక్టర్లు గుర్తించారంట, మమ్మల్ని చూస్తేనే దివ్యాంగులమని సామాన్యులకు కూడా తెలుస్తుంది. కానీ డాక్టర్లకు ఎందుకు మా పరిస్థితి అర్థం కాలేదో అని



ఆందోళన చేస్తున్న దివ్యాంగులతో మాట్లాడుతున్న ఆర్డీఓ

ఆర్డీవో ఎదుట వాపోయారు. మాకు న్యాయం చేయాలని కోరారు.

స్పందించిన ఆర్డీవో : దివ్యాంగుల బాధను, గోడును ఆలకించిన ఆర్డీవో వెంటనే స్పందించారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు వివరిస్తామన్నారు. మరోసారి వైద్యపరీక్షలు చేయించేలా ఉన్నతాధికారులకు తెలియజేసి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. దీంతో దివ్యాంగులు ఆందోళన విరమించారు.

యూరియా కొరత సృష్టిస్తే కేసులు

- విజిలెన్స్, పోలీసు అధికారుల హెచ్చరిక



ఎరువుల దుకాణంలో తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

జమ్మలమడుగు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): రైతులకు ఫర్టిలైజర్స్ దుకాణ యజమానులు అధిక ధరలకు యూరియా, ఇతర మందులు విక్రయించినా, కొరత సృష్టించినా కేసులు నమోదు చేస్తామనిఉమ్మ డి కడప జిల్లా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అడిషనల్ ఎస్పీ శ్రీనివాసరావు, వ్యవసాయ విజిలెన్స్ అధికారి ఖాజాహుస్సేన్, డీఎస్పీ వెంకటేశ్వరరావు హెచ్చరించారు. సోమవారం మధ్యాహ్నం జమ్మలమడుగు పట్టణంలో ఫర్టిలైజర్స్ దుకాణాలపై విజిలెన్స్, పోలీసు, వ్యవసాయ అధికారులు కలిసి దాడులు నిర్వహించారు. జమ్మలమడుగు ముద్దనూరు రోడ్డులోని ఫర్టిలైజర్స్ దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు. ఈ సమాచారం తెలుసుకున్న కొందరు దుకాణాల యజమానులు మూత వేసినట్లు రైతుల ద్వారా తెలిసింది. వ్యవసాయశాఖ ఏడీ అనిత, స్థానిక వ్యవసాయ అధికారి శ్రీకాంత్‌రెడ్డి, అర్బన్ సీఐ నరేష్‌బాబు, ప్రొద్దుటూరు త్రీటౌన్ సీఐ కె.వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గంధం మహోత్సవం



గంధం మహోత్సవం కార్యక్రమంలో పాల్గొన్న పీఠాధిపతి ఆరిఫుల్లా హుస్సేని

కడప కల్చరల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ప్రఖ్యాతి గాంచిన కడప అమీన్‌పీర్ దర్గాలో ఆదివారం రాత్రి 10వ పీఠాధిపతి హజరత్ అమీన్ పీర్ మాలిక్ గంధం మహోత్సవం, సోమవారం ఉరుసు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దర్గా పీఠాధిపతి అరిఫుల్లా హుస్సేని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి గంధం సమర్పించారు. దర్గా ఆవరణం నుంచి హజరత్ అమీన్‌పీర్ మాలిక్ మజార్ వరకు గంధం ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు.

ఉరుసు మహోత్సవాలకు పలువురు రాజకీయ నాయకులు, పుర ప్రముఖులు, సినీప్రముఖులు హాజరయ్యారు. ఏపీతో పాటు తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి భక్తులు వేలాదిగా పాల్గొన్నారు. రాత్రి 10 గంటలకు ప్రముఖ కవ్వాల్ మీరాజ్ వారిచే గొప్ప ఖవ్వాలి కార్యక్రమం నిర్వహించారు.

పోక్సో కేసులో ఇద్దరు యువకులకు బతికినంత కాలం జైలు

పూతలపట్టు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): పోక్సో కేసులో ఇద్దరు యువకులకు బతికినంత కాలం జైలు శిక్ష విధిస్తూ చిత్తూరు న్యాయస్థానం సంచలన తీర్పు ఇచ్చింది. మదనపల్లెకి చెందిన 16 ఏళ్ల బాలిక.. 2019 నవంబరు 24వ తేదీన తిరుమలకు వెళ్లి దేవుడి దర్శనం చేసుకుంది. అదే రోజు రాత్రి తిరుపతికి చేరుకుని తిరుచానూరుకు నడిచివెళుతుండగా బైక్‌పై వస్తుండిన తిరుపతి రూరల్ మండలం తిరుచానూరు సమీపంలోని బ్రాహ్మణపట్టుకు చెందిన చిత్తూరు వెంకటేష్ (34)ను లిఫ్ట్ అడిగింది. అతను బాలికను బైక్‌పై ఎక్కించుకుని తిరుచానూరులో దింపకుండా ముండ్లపూడి గ్రామం వైపు తీసుకెళ్లాడు. అక్కడున్న పొదలవద్ద బైక్‌ను ఆపి.. పెట్రోల్ అయిపోయింది.. తీసుకురమ్మని తన స్నేహితుడు బుక్కే రాజామోహన్ నాయక్ (34)కు ఫోన్‌చేసి చెప్పాడు. అతడు వచ్చాక రాత్రి ఒంటి గంట ప్రాంతంలో ఇద్దరూ కలిసి బాలికను ముళ్ల పొదల్లోకి తీసుకెళ్లి అత్యాచారం చేశారు. బాలిక వారి వద్ద నుంచి తప్పించుకుని రోడ్డుపైకి వచ్చి కాపాడండి అంటూ పెద్దగా కేకలు వేసింది. అటుగా వెళుతున్న పాదచారులు గమనించి, బాలిక తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. ఈ ఘటనపై బాలిక తల్లి తిరుచానూరు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి,



శిక్షపడిన ముద్దాయిలు

నిందితులను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. ఈ కేసు చిత్తూరులోని పోక్సో కోర్టులో సోమవారం వాయిదాకు రాగా న్యాయమూర్తి పూర్వాపరాలు పరిశీలించారు. నేరం రుజువు కావడంతో ముద్దాయిలకు బతికినంతకాలం జైలు శిక్షతోపాటు వెంకటేష్‌కు రూ.17,500, రాజామోహన్ నాయక్‌కు రూ.13,500 జరిమానా విధించారు. బాధితురాలికి రూ.3లక్షల నష్టపరిహారం ప్రభుత్వం చెల్లించాలని న్యాయమూర్తి శంకర్‌రావు తీర్పునిచ్చారు. ఈ కేసును స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ మోహనకుమారి కేసును వాదించారు.

రూ.47లక్షల ఎరువుల అమ్మకాలు నిలుపుదల

పులివెందుల రూరల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): పులివెందుల పరిధిలోని ఎరువుల దుకాణాల్లో వ్యవసాయశాఖ, పోలీస్, విజిలెన్స్ శాఖలు సంయుక్తంగా సోమవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా యూరియా, డీఏపీ, ఎంఓపీ, కాంప్లెక్స్ ఎరువులకు సంబంధించిన అమ్మకాలు కొనుగోలు వివరాలు, యూరియాకు సంబంధించిన స్టాక్ వివరాలు, రసీదులను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పులివెందుల ఏడీఏ అంబవరం ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఏడు దుకాణాలలో పలు లోపాలను గుర్తించామన్నారు. సుమారు రూ.47 లక్షల విలువైన వివిధ రకాల ఎరువుల అమ్మకాలను నిలుపుదల చేశామ న్నారు. కార్యక్రమంలో సీఐ రమణ, ఏఓ చెన్నారెడ్డి, టెక్నికల్ ఏఓ సునీల్ కుమార్‌రెడ్డి, విజిలెన్స్‌శాఖ హెడ్‌కానిస్టేబుల్ రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు విరివిగా రుణాలు ఇవ్వాలి



మాట్లాడుతున్న ఆప్కాబ్ ఛైర్మన్ వీరాంజనేయులు

కడప రూరల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) రైతులకు విరివిగా అన్ని రకాల రుణాలు అందించి తద్వారా ప్రభుత్వ లక్ష్యసాధనకు తోడ్పాటు అందించాలని ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు పేర్కొన్నారు. సోమవారం ఆయన డీసీసీ బ్యాంకును ఆకస్మికంగా సందర్శించారు. సీనియర్ అధికారులు, బ్యాంకు సిబ్బందితో మాట్లాడి బ్యాంకు స్థితిగతులను తెలుసుకున్నారు. అనంతరం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆప్కాబ్ తరుపున డీసీసీ బ్యాంకు కు అన్ని రకాల ప్రయోజనాలు చేకూరుస్తామని... జిల్లా రైతాంగానికి అండగా నిలవాలన్నారు. అందుకు ఎన్ని కోట్లు రుణాలు కావాలన్నా మంజూరు చేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ఉద్యోగ సమస్యలను కూడా పరిష్కరిస్తామన్నారు. సమావేశంలో డీసీసీబీ ఛైర్మన్ ఎం.సూర్యనారాయణరెడ్డి, సీఈవో రాజామణి, డీజీఎం ప్రతాప్‌రెడ్డి, ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు నారాయణరెడ్డి, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

చెస్ పోటీల్లో సత్తాచాటిన కడప క్రీడాకారులు



చెస్‌లో సత్తాచాటిన జిల్లా క్రీడాకారులు

కడప స్పోర్ట్స్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లా వెంకటగిరిలో ఈనెల 24న జరిగిన ఆలిండియా వన్‌డే ఓపెన్ చెస్ టోర్నమెంటులో కడపకు చెందిన చెస్ క్రీడాకారులు సత్తాచాటినట్లు జిల్లా చెస్ సంఘం కార్యదర్శి అనీస్‌దర్బారి వెల్లడించారు. ఇందులో దేశం నలుమూలల నుంచి సుమారు 265 మంది చెస్ క్రీడాకారులు పాల్గొన్నారని తెలిపారు. వారిలో జిల్లాకు చెందిన 23 మంది చెస్ క్రీడాకారులు పాల్గొని అండర్-14 బాలికల విభాగంలో సరయూ ద్వితీయ స్థానం సాధించగా, అండర్-12 విభాగంలో లక్ష్మి 3వ స్థానం, అండర్-8 బాలుర విభాగంలో అర్హాన్ తృతీయ స్థానం, అండర్-10 బాలికల విభాగంలో అమీనా నాలుగోస్థానం, మహిళల విభాగంలో సబీహా 4వ స్థానం, ఓపెన్ విభాగంలో భగత్ 13వ స్థానం సాధించినట్లు తెలిపారు.

అట్టహాసంగా జిల్లాస్థాయి యోగా ఎంపిక పోటీలు

వేంపల్లె, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): వేంపల్లెలో జిల్లాస్థాయి యోగా ఎంపిక పోటీలు అట్టహాసంగా జరిగాయి. జిల్లా యోగా అసోషియేషన్ అధ్యక్షుడు అనిల్, కార్యదర్శి తేజ ఆధ్వర్యంలో స్థానిక శ్లోక హైస్కూల్‌లో సోమవారం ఈ పోటీలు జరిగాయి. జిల్లాలోని కడప, పులివెందుల, తొండూరు, వేంపల్లె, ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీ తదితర ప్రాంతాల నుంచి పలువురు ఈ యోగా పోటీల్లో పాల్గొన్నారు. 70 మందికి పైగా ఈపోటీల్లో పాల్గొనగా పలువురు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు.



యోగ పోటీలకు హాజరై ప్రశంసాపత్రాలు అందుకున్న విద్యార్థులు తదితరులు

ఆయా వయసు గ్రూపులలో ఈ పోటీలు జరగ్గా విజేతలుగా నిలిచిన వారిని సెప్టెంబరు 6,7 తేదీల్లో తూర్పు గోదావరి జిల్లా ద్వారకా తిరుమలలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని అధ్యక్ష, కార్యదర్శులు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ కుమారస్వామి గుప్త, శ్లోక కరస్పాండెంట్ నవనీశ్వర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సురేంద్ర చేతులమీదుగా విజేతలకు ప్రశంసాపత్రాలను అందించారు. పరిశీలకులు మనోహర్‌రెడ్డి, రెఫరీ కేశవ తదితరులు పాల్గొన్నారు.

ఎస్వీఅండ్ఎస్ఎస్‌డబ్ల్యుఏ వర్కింగ్ ప్రెసిడెంటుగా రవి



కడప మారుతీనగర్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): స్టేట్ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ స్టాఫ్ వెల్ఫేర్ అసోసియేషన్ (ఎస్వీఅండ్ఎస్ ఎస్‌డబ్ల్యుఏ) నూతన వర్కింగ్ ప్రెసిడెంటుగా కడప డిపోలో విధులు నిర్వహిస్తున్న ఆర్టీసీ కానిస్టేబుల్ గుండ్లకొండ రవి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టేట్ విజిలెన్స్ విభాగంలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించేం దుకు కృషి చేస్తానని వెల్లడించారు.

గల్లంతైన యువకుడి శవం లభ్యం

దువ్వూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జిల్లేళ్ల గ్రామానికి చెందిన నాదేళ్ల షఫిక్ (15) మృతదేహం సోమవారం తెల్లవారుజామున లభ్యమైంది. ఆదివారం కేసీ కాలువలో పడి షఫిక్ గల్లంతు అయిన విషయం విధితమే. మృతదేహం కోసం ఎంత వెతికినా కనిపించలేదు. ఈ నేపథ్యంలో పోలీసులు కేసీ అధికారులతో మాట్లాడి కాలువలో నీటిమట్టాన్ని తగ్గింపజేశారు. దీంతో ఏకోపల్లె సమీపంలో మృతదేహాన్ని గుర్తించి బయటికి తీశారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా, మృతి చెందిన షఫిక్ దువ్వూరు జడ్పీ హైస్కూలులో 10వ తరగతి చదువుతున్నాడు. సంఘటన గురించి తెలిసిన స్నేహితులు, ఉపాధ్యాయులు విషాదంలో మునిగిపోయారు. షఫిక్ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

దాడి ఘటనపై పరస్పర ఫిర్యాదు

పులివెందుల, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): పులివెందుల పట్టణంలో సోమవారం ఉదయం 10గంటల ప్రాంతలో జరిగిన ఘటనలో ఇరువురు పరస్పర ఫిర్యాదులు చేసుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. సోమవారం ఉదయం ఓ ఎలక్ట్రికల్ షాప్‌లో ఉన్న తనపై దాడి చేశారని పులివెందులకు చెందిన సుంకేసుల ఆదిశేషు అనే వ్యక్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇటీవల జరిగిన జడ్పీటీసీ ఎన్నికలలో వైసీపీ తరపున ప్రచారం ఎందుకు నిర్వహించావని దూషిస్తూ తనపై ఆర్.తుమ్మలపల్లెకు చెందిన విశ్వనాథరెడ్డి, అతని అనుచరుడు తనపై దాడి చేశారని, ఈ ఘటనలో తన ఎడమ చేయి విరిగిందని ఆదిశేషు తెలిపారు. దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశానన్నారు. అలాగే సొంత పనిపై ఎలక్ట్రికల్ షాపునకు వెళ్లానని టీడీపీ నాయకుడు విశ్వనాథరెడ్డి అనుచరుడు మల్లెం శేఖర్ అనే వ్యక్తి తెలిపారు. అయితే ఆదిశేషు తనను కులంపేరుతో దూషించాడని... ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేశానని తెలిపారు. ఆదిశేషుపై చర్యలు తీసుకోవాలని మల్లెం శేఖర్ పోలీసులకు ఫిర్యాదు పత్రాన్ని అందించారు. ఈ పరస్పర ఫిర్యాదులుపై కేసు నమోదు వివరాలు తెలుసుకునేందుకు అర్బన్ సీఐ చాంద్‌బాషకు ఫోన్ చేయగా ఆయన అందుబాటులోకి రాలేదు.

సిద్ధేశ్వరస్వామి ఆలయ భూముల రిపోర్టును రద్దు చేయాలి



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న కలమల్ల గ్రామస్థులు

ఎర్రగుంట్ల, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): కలమల్లలో వెలసిన సిద్ధేశ్వరస్వామి ఆలయ మాన్యం భూముల విషయంలో త్రిసభ్య కమిటీ నివేదికను రద్దు చేయాలని కలమల్ల గ్రామానికి చెందిన సిద్ధేశ్వరస్వామి దేవస్థానం ఛైర్మన్ ఇల్లూరు రామప్రసాద్‌రెడ్డి, తారక రామారెడ్డి, గ్రామప్రజలు సోమవారం కలెక్టర్‌కు వినతి పత్రం ఇచ్చారు. సిద్ధేశ్వరస్వామి ఆలయం 1943 నుంచి వుందని, ఆలయానికి 61.50 ఎకరాల భూమి ఉందన్నారు. ఆలయాన్ని ఆర్టీపీపీ నిర్మాణ దశలో పునర్నిర్మాణం చేశారన్నారు. అయితే గ్రామానికి చెందిన ఓ వర్గం వారు ఆలయానికి పేరు మార్చి అసత్యాన్ని సత్యంగా చూపించే ప్రయత్నం చేశారన్నారు. ఈ ఆలయాలకు సంబంధించి ఆర్డీవో, తహసీల్దార్, ఎండోమెంట్ ఏసీని రిపోర్టు ఇమ్మని కలెక్టర్ కోరారని... అయితే వారు గ్రామ ప్రజలందరితో సమావేశం నిర్వహించకుండా పూర్వ రికార్డులు పరిశీలించకుండా ఏకపక్షంగా రిపోర్టును ఇచ్చారన్నారు. గ్రామంలో 1992లో సంవత్సరంలో వీరభద్ర సహిత ఉమామహేశ్వరస్వామి ఆలయంగా రిజిస్ట్రేషన్ చేసుకున్న వారే ఇప్పుడు ఇదే సిద్ధేశ్వరస్వామి ఆలయం అంటూ మసిపూసి మారేడుకాయ చేశారని ఆరోపించారు. వెంటనే వారిచ్చిన రిపోర్టును వెంటనే రద్దు చేయాలన్నారు.

సహకారశాఖలో పదోన్నతులు

కడప ఎన్టీఆర్ సర్కిల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): సహకార శాఖలో పలువురికి పదోన్నతులు లభించాయి. రాజంపేట డివిజనల్ కోఆపరేటివ్ ఆఫీసులో పనిచేస్తున్న అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఎం.గోపిక్రిష్ణకు కడప డివిజనల్ కోఆపరేటివ్ ఆఫీ సరుగా పదోన్నతి కల్పించారు. అలాగే బద్వేలు సబ్ డివిజనల్ కో ఆపరేటివ్ ఆఫీసరుగా పనిచేస్తున్న వైఎస్ సి.సత్యానందంను ప్రొద్దుటూరు డివిజనల్ కోఆపరేటివ్ ఆఫీసరుగా పదోన్నతిపై నియ మించారు. ప్రొద్దుటూరు అసిస్టెంటు రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న బ్రహ్మానందరెడ్డికి పదోన్నతి కల్పించి డిస్ట్రిక్ట్ కోఆపరేటివ్ ఆడిట్ ఆఫీసరుగా నియమించారు.

ప్రశాంతంగా డాక్టర్ వైఎస్సార్ ఏఎఫ్‌యూ ప్రవేశాల కౌన్సెలింగ్

కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ వైఎస్సా ర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీలో జరిగిన బీఎఫ్ఏ ఫోర్ ఇయర్స్ డిగ్రీ ఫైన్ ఆర్ట్స్ (యానిమేషన్, అప్లై డ్ ఆర్ట్, పెయింటింగ్, ఫొటోగ్రఫీ, శిల్పం మరియు బిడెస్ ఇంటీరియర్ డిజైన్) కోర్సులకు కౌన్సెలింగ్ ప్రశాంతంగా జరిగింది. 70శాతం విద్యార్థులు హాజరై, డాక్టర్ వైఎస్సార్ ఏఎఫ్‌యూ వీసీ డాక్టర్ జి.విశ్వనాథ్ కుమార్ చేతుల మీదు గా విద్యార్థులు సీట్ అలాట్‌మెంట్ పొందారు. అదేవిధంగా బిఎఫ్ఎ/బి డిజైన్ కోర్సులకు 2వ దశ కౌన్సెలింగ్ సెప్టెంబరు 3న నిర్వహించబడునన్నారు.

కోనేరు రంగారావు కమిటీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌పై విచారణ

- పది రోజుల్లో సంజాయిషీ చెప్పాలని నోటీసులు

కలికిరి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా కలెక్టరు కార్యాలయంలో కోనేరు రంగారావు కమిటీ (కేసీసీ) స్పెషల్ డిప్యూటీ కలెక్టరుగా విధులు నిర్వహిస్తున్న మణిపాటి రామసుబ్బయ్యపై ప్రభుత్వం విచారణకు ఉపక్రమించింది. ఈ మేరకు పది రోజుల్లో ఆరోపణలపై వివరణ ఇవ్వాల్సిందిగా ఆదేశిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. స్పెషల్ డిప్యూటీ కలెక్టరు రామసుబ్బయ్య నంద్యాల గాలేరు-నగరి సుజల స్రవంతి ప్రాజెక్టులో భూసేకరణ కోసం పనిచేస్తున్న 2020-2022 మధ్య తీవ్రమైన అవకతవకలకు పాల్పడినట్లు ప్రభుత్వం ఆరోపించింది. ఈ మేరకు ఏసీబీ డైరెక్టర్ జనరల్ ప్రభుత్వానికి అందజేసిన నివేదిక మేరకు తగు చర్యలు తీసుకునే ముందు రామసుబ్బయ్య నుంచి వివరణ కోరింది. 1987లో జూనియర్ అసిస్టెంటుగా ఉద్యోగంలో చేరి అనంతరం పదోన్నతులు పొంది అనంతపురం జిల్లా కదిరి ఆర్డీవోగా 2020 వరకూ పనిచేశారు. అనంతరం స్పెషల్ డిప్యూటీ కలెక్టరుగా జీఎన్ఎస్ఎస్ భూసేకరణ విభాగంలో పనిచేసేటప్పుడు వెలుగులోకి వచ్చిన పలు అభియోగాలపై ఏసీబీ దర్యాప్తు జరిపింది. 41 మంది రైతులకు చెందిన డీకేటీ భూములకు పరిహారం చెల్లించకుండా వాయిదాలు వేస్తూ వచ్చారని రైతులు ఆరోపించారు. చివరికి మొత్తం భూములకు చెల్లించాల్సిన రూ.90 లక్షల పరిహారంలో పది శాతం తనకు చెల్లించాలని రామసుబ్బయ్య పట్టుబట్టారని రైతు ల ప్రధాన ఆరోపణ. దీనికిగానూ మొదటి విడతగా రూ.1.50 లక్షలు విడతల వారీగా రైతులు చెల్లించారు. మధ్యలో డబ్బు కోసం వత్తిడి పెరగడంతో వారు నేరుగా ఏసీబీ అధికారులకు, జిల్లా కలెక్టరుకు ఫిర్యాదులు చేశారు. ఫోన్‌పే ద్వారా ఆయన సహాయకుడికి చేసిన డబ్బుల చెల్లింపులు, వాయిస్ కాల్ రికార్డులు ఏసీబీకి లభ్యమయ్యాయి. దీంతో లోతుగా దర్యాప్తు జరిపిన ఏసీబీ సుబ్బరామయ్యపై 2024లో తీవ్రమైన అభియోగాలు నమోదు చేసింది. ఈ మొత్తం వ్యవహారంపై సుదీర్ఘమైన అంశాలను పొందుపరిచిన ఏసీబీ నివేదిక మేరకు విచారణకు సిద్ధమైన ప్రభుత్వం ప్రాథమికంగా సుబ్బరామయ్యకు సోమవారం నోటీసులు జారీ చేసింది. నోటీసులతో పాటు 33 మంది నుంచి తీసుకున్న వాంగ్మూలాలను, రాతమూలకమైన ఫిర్యాదులను కూడా విచారణ కోసం సుబ్బరామయ్యకు జారీ చేసిన నోటీసులకు జత చేస్తూ రెవెన్యూ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జి.జయలక్ష్మి సోమవారం ఆదేశాలు జారీ చేశారు.

షూటింగ్ బాల్ జట్టుకు విద్యార్థులు


విద్యార్థులతో ప్రిన్సిపాల్ హేమంత్‌కుమార్

తంబళ్లపల్లె, ఆగస్టు 25 (ఆంధ్ర జ్యోతి): అన్నమయ్య జిల్లా జూనియర్ షూటింగ్ బాల్ జట్టుకు తంబళ్లపల్లె మండలం నుంచి ఆరుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. ఆదివారం మదనపల్లెలోని గ్రీన్‌వ్యాలీ ఇంటర్నేషనల్ స్కూల్ మైదానంలో జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ చైర్మన్ జునైద్ అక్బరీ, కార్యదర్శి గౌతమి ఆధ్వర్యంలో జూనియర్ షూటింగ్ బాల్ అన్నమయ్య జిల్లా బాల, బాలికల జట్లు ఎంపిక జరిగింది. ఈ ఎంపికకు జిల్లాలోని పలు పాఠశాలల నుంచి వందల సంఖ్యలో షూటింగ్ బాల్ క్రీడాకారులు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. ఈ పోటీల్లో కన్నెమడుగు ఉన్నత పాఠశాలలో 9వ చదువుతున్న రిషిత, ప్రియ, ప్రవల్లికతో పాటు స్టాండ్ బై ప్లేయర్‌గా స్వాతి ఎంపికయ్యారని పీడీ ఖాదర్‌బాషా తెలిపారు. అలాగే తంబళ్లపల్లె మోడల్ స్కూల్ నుంచి ఇంటర్ చదువుతున్న గౌస్ అహ్మద్, 10వ తరగతి చదువుతున్న కరీమున్నిసా, 9వ తరగతి చదువుతున్న హర్షవర్ధన్ జిల్లా జూనియర్ షూటింగ్ బాల్ జట్టుకు ఎంపికయ్యారని పీడీ తెలిపారు. వీరు సెప్టెంబరు నెలలో నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాళెంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా జట్టు తరుపున పాల్గొంటారని తెలిపారు. జిల్లా జట్టుకు ఎంపికైన విద్యార్థులను ఎంఈవో త్యాగరాజు, నాగసుబ్బరాయుడు, ప్రిన్సిపాల్ హేమంత్‌కుమార్, హెచ్‌ఎం మదన్‌మోహన్, ఎస్‌ఎంసీ చైర్మన్లు అభినందించారు.

మట్టి విగ్రహాలను పూజిద్దాం

● నేడు 2 వేల మట్టి విగ్రహాలు ఉచిత పంపిణీకి సిద్ధం

పీలేరురూరల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మట్టి విగ్రహాలను పూజించి పర్యావరణాన్ని కాపాడుదామని సాయిబాబా భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.వీరయ్య, జి.ప్రభాకర్‌రాజు తెలిపారు. సోమవారం వారు పీలేరులో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గత దశాబ్ద కాలంగా పీట్టణంలో వినాయక చవితి పర్వదినాన్ని పురష్కరించుకొని ఉచితంగా గణేష్ మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్నామని చెప్పారు. మంగళవారం ఉదయం 11 గంటలకు పీలేరు నాలుగు రోడ్ల కూడలిలో 2 వేల విగ్రహాలు ప్రజలకు ఇవ్వనున్నామని తెలిపారు. మట్టి విగ్రహాలను పూజించి పర్యావరణాన్ని కాపాడాలని వారు పిలుపునిచ్చారు.

ఖాతాదారులకు సేవలందించడమే లక్ష్యం

కలకడ, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): సహకార సంఘా ల ద్వారా ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యమని వాల్మీకిపురం డీసీసీబీ మేనేజర్ లావణ్య అన్నారు. సోమవారం సింగిల్ విండ్ అధ్యక్షుడు మద్దిపట్ల వెంకటరమణనాయుడు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ తమ బ్యాంక్‌లో డిపాజిట్లపై ఆకర్షణీయమైన వడ్డీ రెట్లు, ఇన్సూరెన్స్ సదుపాయం ఉందన్నారు. బ్రాంచ్‌ల పరిధిలోని అన్ని పంచాయతీ పరిధిలో రూరల్ మార్టిగేజ్ ద్వారా గృహ రుణాలు, అర్హులైన రైతులకు పంట రుణాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. అలాగే పనిదినాల్లో బంగారు రుణాలు, సూర్యఘర్ పథకానికి 12 శాతం వడ్డీతో లోన్ ఇస్తామన్నారు. కార్యక్రమంలో నేతలు బి.వి.స్వామి, రైస్‌మిల్ రమణ, సభ్యులు వెంకటరమణ, గిరిజమ్మ, సూపర్‌వైజర్ శ్రీనివాసులు, నాగేంద్రబాబు పాల్గొన్నారు.

క్షయవ్యాధి పట్ల అవగాహన ఉండాలి

నిమ్మనపల్లి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): క్షయవ్యాధి పట్ల ప్రజలు అవగాహన కలిగి వుండాలని డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్‌రఫి, టీబీ పర్యవేక్షకుడు నాగిరెడ్డిలు పేర్కొన్నారు. సోమవారం మండలంలోని తవళం పంచాయతీ ఎగువపల్లిలో టీబీ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీబీ వ్యాధిగ్రస్తులు ప్రపంచంలో కెల్లా భారతదేశంలో అధికంగా వున్నారని తెలిపారు. ఈ వ్యాధి ఒకరి నుంచి మరొకరికి గాలి ద్వారా, తుంపర్ల ద్వారా సంక్రమిస్తుందని, దీన్ని గుర్తించేందుకు రెండువారాల పాటు దగ్గు రావడం, ఆయాసం, గళ్ల, జ్వరం రావడం వంటివి లక్షణాలుగా తెలిపారు. ఒక వేళ వ్యాధి సోకినట్లు నిర్ధారణ అయితే అటువంటి వారికి దాదాపు 6 నెలల పాటు ఉచితంగా మందులు ఇస్తారని తెలిపారు. వైద్య సిబ్బంది కరుణ, సాలమ్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి ముందుండాలి

● బీజేపీ సీనియర్ నాయకుడు రమణారెడ్డి

పెద్దతిప్పసముద్రం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలో బీజేపీ బలోపేతానికి యువత ముందుండాలని ఆ పార్టీ సీనియర్ నాయకుడు గోల్డెన్‌వ్యాలీ రమణారెడ్డి వెల్లడించారు. సోమవారం ఆయన మండల కేంద్రమైన పీటీఎంలోని పెద్దకాలువగడ్డ వద్ద ఉన్న రామాలయంలో పార్టీ మండల నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో నాయకులు, కార్యకర్తల మధ్య విభేదాల కారణంగా పార్టీ ముందుకు సాగడం లేదని, పార్టీలో నాయకులు సమన్వయంతో అందరినీ కలుపుకుని బలోపేతానికి కృషి చేస్తే పార్టీ బలం పుంజుకుంటుందన్నారు. ఆయా గ్రామాల్లో ఏవైనా సమస్యలు ఎదురైతే తమ దృష్టికి తీసుకొస్తే అదిష్టానం దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరించేందుకు కృషిచేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శివయ్య, శంకర, వక్కల సుబ్బమ్మ, మండల ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, రామచంద్ర, సుబ్బు, తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బందిపై టీడీపీ నేతల ఫిర్యాదు

పెద్దతిప్పసముద్రం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని టి.సదుం గ్రామ సచివాలయ పరిధిలో అగ్రికల్చర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న సిబ్బందిపై స్థానిక టీడీపీ నేతలు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సోమవారం జిల్లా అగ్రికల్చర్ జేడీ శివనారాయణను కలిసి ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ ఇక్కడ పనిచేస్తున్న అగ్రికల్చర్ అసిస్టెంట్ సాధారణ బదిలీల్లో భాగంగా ఇటీవల బదిలీ అవ్వడంతో అతని స్థానంలో భాస్కర్ విధుల్లో చేరారన్నారు. కానీ వెనువెంటనే మెడికల్ లీవుపై వెళ్లిపోవడంతో టి.సదుం సచివాలయ పరిధిలో ఉన్న రైతులకు ఇబ్బందులు మొదలయ్యాయన్నారు. అంతేకాకుండా ప్రభుత్వ పథకాల స్టేటస్ చెక్ చేసుకోవాలన్నా ఇబ్బందిగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో చంద్రమోహన్‌రెడ్డి, వెంకటరెడ్డి, వెంకటప్ప పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌లను సత్వరమే పరిష్కరించాలి

● సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి


పీజీఆర్ఎస్ కార్యక్రమంలో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్

మదనపల్లె అర్బన్, ఆగస్టు 25: పీజీఆర్ఎస్ కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులకు సత్వరమే పరిష్కారం చూపాలని సబ్‌కలెక్టర్ చల్లా కళ్యాణి పేర్కొన్నారు. సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమానికి 96 ఫిర్యాదులు అందినట్లు సబ్ కలెక్టర్ చెప్పారు. ఇందులో అధికంగా భూ వివాదాలు, ప్రభుత్వం అందించిన ఇళ్ల సమస్యలపై అర్జీలు వచ్చాయన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో మదనపల్లె జిల్లాగా ప్రకటిస్తామని హామీ ఇచ్చినా నెరవేర్చలేదని బహుజన యువసేన అధ్యక్షుడు పునీత్ ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. వెంటనే మదనపల్లె జిల్లా ప్రకటన చేసి మదనపల్లె ప్రజల ఆశను నేరవేర్చాలని కోరారు. ఏడాదిన్నర ఏళ్లు గడిచిన హామీను అమలు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పొలాలకు దారిలేక సీటీఎం గ్రామం చెరుకువారిపల్లెకు చెందిన చంద్రయ్య, నిమ్మనపల్లె మండలం, వెంగంవారిపల్లెలో రికార్డులో దారి ఉన్న తమకు చూపడం లేదని, అక్కడ వేణుగోపాల్‌రెడ్డి, మరికొందరు అడ్డుకొంటున్నారని శివలింగం ఆరోపించారు. అనేక సార్లు ఫిర్యాదు చేసిన వారికే అనుకూలంగా రెవెన్యూ అధికారులు సాయం చేస్తున్నారని తెలిపారు. అలాగే ముదివేడుకు చెందిన ఎగువ గొల్లపల్లెకు చెందిన ఆదిలక్ష్మీ తనకు ప్రభుత్వం ఇచ్చిన పట్టా స్థలాన్ని కబ్జా చేశారని ఫిర్యాదు చేశారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి మల్లిక, ఐటీయూసీ నాయకుడు కృష్ణమూర్తి ఆధ్వరంలో సబ్ కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందించారు. అనంతరం స్థానిక మిషన్ కాంపౌండ్ వద్ద ఉన్న ఇంటర్, డిగ్రీ బాలికల బీసీ వసతిగృహంలో అనేక సమస్యలు ఉన్నాయని వాటిని వెంటనే పరిష్కరించాలని కోరారు.

విజయోత్సవ సభను జయప్రదం చేయాలి: నల్లారి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి

పీలేరు, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): పీలేరులో ఈ నెల 30న జరగనున్న సూపర్ సిక్స్ పథకాల విజయోత్సవ సభను జయప్రదం చేయాలని పీలేరు నియోజకవర్గంలోని టీడీపీ శ్రేణులకు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. విజయోత్సవ సన్నాహాల్లో భాగంగా సోమవారం పీలేరులోని పార్టీ కార్యాలయంలో ఆయన నియోజకవర్గ స్థాయి విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన సూపర్‌సిక్స్ పథకాలను అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే కూటమి ప్రభుత్వం అమలు చేసిందన్నారు. ఆ పథకాలకు ప్రజల్లో మంచి స్పందన లభించిందని, సమాజంలోని అన్నివర్గాల వారు ఆ పథకాల ద్వారా లబ్ధి పొందుతున్నారన్నారు. పార్టీ ఆదేశాల మేరకు సూపర్ సిక్స్ పథకాల విజయోత్సవ సభను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నామని, నియోజకవర్గంలోని ప్రతి గ్రామం నుంచి ప్రజలు స్వచ్ఛందంగా తరలి వచ్చేలా పార్టీ శ్రేణులు కృషి చేయాలన్నారు. ఈ నెల 30న పీలేరులోని మార్కెట్ కమిటీ ఆవరణలో ఉదయం 9.30 గంటలకు జరిగే విజయోత్సవ సభను విజయవంతం చేయాలని ఆయన పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. అంతకుమునుపు సోమవారం ఉదయం ఆయన రాయచోటిలో జరిగిన పార్టీ సమావేశానికి హాజరయ్యేందుకు వెళుతున్న రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణ రెడ్డికి పీలేరులో ఆత్మీయ స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర జంగం కార్పొరేషన్ చైర్మన్ వాసునూరి చంద్రశేఖర్, ఏఎంసీ చైర్మన్‌లు పురం రామ్మూర్తి, కోసూరి చంద్రమౌళి, సింగిల్ విండో అధ్యక్షుడు రెడ్డప్పరెడ్డి, నాయకులు కోటపల్లె బాబు రెడ్డి, మల్లెల రెడ్డిబాషా, అమరనాథరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి చెందిన ప్రాంతాల్లో పనులా ?

● కౌన్సిలర్ల మండిపాటు


అభివృద్ధి పనులపై ప్రశ్నిస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ వెంకటాచలపతి

మదనపల్లె, ఆగస్టు 25(ఆంధ్ర జ్యోతి): మదనపల్లె మున్సిపాలిటీలో ఏళ్ల తరబడి అభివృద్ధి చెందని ప్రాంతాలను వదిలేసి, అభివృద్ధి చెందిన ప్రాంతాల్లో రోడ్లు, కాలువలు మంజూరు చేయడాన్ని అడ్డుకుంటామని కౌన్సిలర్లు పేర్కొన్నారు. అలాగే స్థానిక వార్డు కౌన్సిలర్, చైర్‌పర్సన్ దృష్టికి తేకుండా ప్రతిపాదించిన పనులకు కూడా ఆమోదం తెలపమంటూ తెగేసి చెప్పారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సోమవారం సాయంత్రం చైర్‌పర్సన్ వి.మనూజ అధ్యక్షతన మున్సిపల్ సాధారణ, అత్యవసర సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సమావేశం ప్రారంభం నుంచి అజెండాలోని వివిధ అంశాలపై కౌన్సిల్ అభ్యంతరం వ్యక్తం చేసింది. తమ వార్డుల్లో ఇప్పటికే మంజూరైన పనులు మూడేళ్లయినా ఇప్పటికీ చేపట్టలేదని, అలాంటప్పుడు పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో రూ.కోట్లతో ప్రతిపాదించిన పనులను ఎలా చేపడతారని ప్రశ్నించారు. ముందు మంజూరైన పనులు పూర్తి చేశాకే, కొత్త పనులు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం మున్సిపల్ వైస్ చైర్మన్లు జింకా వెంకటాచలపతి, బి.ఎ.నూర్ ఆజాం, కౌన్సిలర్లు కె.ప్రసాద్‌బాబు, నాగార్జునబాబు, బి.ఎ.ఖాజాహుస్సేన్, పి.రాజేష్, ఖాజాహుస్సేన్, వశీంఅక్రం తదితర సమస్యలపై ప్రశ్నించారు. ఇదిలా ఉండగా సాధారణ సమావేశం అజెండాలోని నాలుగు అంశాలు మినహా మిగిలిన అంశాలను కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించింది. తిరస్కరించిన అంశాలపై మరోసారి కౌన్సిలర్లతో చర్చించిన తర్వాతే నిర్ణయం తీసుకుంటామని ప్రకటించారు.

గ్రామీణాభివృద్ధే కూటమి ప్రభుత్వం లక్ష్యం


బోరుమోటర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె అర్బన్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): గ్రామీణాభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని ఎమెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. సోమవారం మండలంలోని పోతబోలు గ్రామంలో ప్రజలకు అందుబాటులో ఉండడానికి గ్రామ సచివాలయాన్ని ఆయన ప్రారంభించారు. అలాగే గ్రామాలకు తాగునీరు అందించడానికి బోరుమోటర్లను ప్రారంభించారు. ఇందులో భాగంగానే పోతబోలుగా గ్రామంలోని తురకపల్లె, కురవపల్లె, బాలప్పగారిపల్లెలో ఇండ్లను ప్రారంభించారు. గ్రామంలోని గడ్డం రామకృష్ణారెడ్డికి రూ. 54,416 సీఎం సహాయ నిధి చెక్కును అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే షాజహాన్‌బాషా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేరుస్తోందన్నారు. గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పాటుపడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో తేదేపా నాయకులు షంషీర్, సుధాకర్, జీకే వెంకటరమణ, నవీన్‌చౌదరి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వీరభద్రుడి పల్లకీ ఉత్సవం

రాయచోటిటౌన్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని భద్రకాళీ సమేత వీరభద్రాలయంలో సోమవారం పల్లకీ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వీరద్రస్వామి, భద్రకాళీ అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను వివిధ రకాల పుష్పాలు, పట్టువస్త్రాలతో అలంకరించారు. పట్టణ భక్తులతో పాటు కన్నడ భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

● పీలేరు జనసేన ఇన్‌చార్జి బెజవాడ దినేష్


పీలేరు ప్రభుత్వ ఆసుపత్రిని పరిశీలిస్తున్న జనసేన నాయకులు

పీలేరు రూరల్, ఆగస్టు 25 (ఆంధ్ర జ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే పేద రోగులకు మెరుగైన వైద్యం అందించాలని పీలేరు నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి బెజవాడ దినేష్, పీలేరు ఏఎంసీ డైరెక్టర్, ఉమ్మడి చిత్తూరు జిల్లా జనసేన కార్యదర్శి కలప రవి తెలిపారు. సోమవారం పీలేరు 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని పరిశీలించారు. ఇక్కడ రోగులకు అందుతున్న వైద్యం, ఇతర వసతులపై రోగులతో మాట్లాడి వివరాలు సేకరించారు. అనంతరం వారు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రులకు గ్రామీణ ప్రాంతాలకు చెందిన పేద రోగులు ఎక్కువగా వస్తుంటారని, అయితే వారికి వైద్యం అందించడంలో ఎటువంటి నిర్లక్ష్యం, కాలయాపన ఉండరాదని సూచించారు. అలాగే త్వరలోనే 20 పడకలు సమకూర్చుతామని సూపరింటెండెంట్‌కు జనసేన నేతలు హామీ ఇచ్చారు. రోగులకు అందుతున్న మందులు, ఆహారం, వైద్యుల అందుబాటు తదితర వివరాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో పీలేరు మండల పార్టీ అధ్యక్షుడు వల్లెపు మోహనకృష్ణ, పార్టీ నాయకులు చిరంజీవి, మున్నా, గౌస్, రాజేష్, నాగరాజు, శేఖర్, భార్గవ, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం

● యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జాబిర్

పీలేరురూరల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించుటలో కూటమి ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తోందని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జాబీర్ తెలిపారు. సోమవారం పీలేరు పట్టణంలోని ఓ కళాశాలలో యూటీఎఫ్ స్టడీ సర్కిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఫ్రెండ్లీ ప్రభుత్వం అని, తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాల్సిన ఆర్థిక బకాయిలు చెల్లిస్తామని, పీఆర్‌సీని అమలు చేస్తామని హామీలు గుప్పించి ఇప్పటికి ఏడాదన్నర కావస్తున్నా ఎటువంటి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవని విమర్శించారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించుటలో పూర్తిగా విఫలమయ్యారని దుయ్యబట్టారు. 12వ పీఆర్‌సీని వెంటనే ప్రకటించాలని, ఈ లోపు ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. పెండింగ్ డీఏలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో యూటీఎఫ్ జిల్లా కోశాధికారి చంద్రశేఖర్, యూనియన్ సీనియర్ నాయకులు జి.రాధాక్రిష్ణ, మోడెం చెంగల్‌రాయుడు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ఆర్ యూనివర్శిటీతో మిట్స్ ఎంవోయూ

కురబలకోట, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగళ్లు సమీపంలోని డీమ్డ్‌టుబి మిట్స్ యూనివర్శిటీ యాజమాన్యం వ్యవసాయరంగంలో ఉత్పత్తులు, ప్యాకేజీలు, ఎగుమతులకు సంబంధించి వైఎస్సార్ యూనివర్శిటీతో ఎంవోయూ కుదుర్చుకున్నట్లు డీమ్డ్ టు బి మిట్స్ యూనివర్శిటీ వైస్‌ఛాన్సలర్ యువరాజ్ పేర్కొన్నారు. ఆదివారం కళాశాలలో ఆ యూనివర్శిటీ ప్రతినిధులతో వీసీ యువరాజ్ తదితరులు సంతకాలు చేసి ఒప్పందం కుదుర్చుకున్నారు. దీని ద్వారా విద్యార్థులకు నాణ్యమైన విద్య, ఇంటర్న్‌షిప్‌లు, ప్లేస్‌మెంట్, అందించడంతో పాటుగా అవగాహన కార్యక్రమాల్లో సహాయ సహకారాలు అందివ్వనున్నట్లు పేర్కొన్నారు. అలాగే కళాశాల విద్యార్థులు ఉమ్మడి మార్గదర్శకత్వంలో ప్రాజెక్టులు, పరిశోధనలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. దీని ద్వారా విద్యార్థులకు విద్యామార్గాలను సుమగమనం చేయడంతో పాటుగా మరింతగా ఉద్యోగవకాశాలు దక్కనున్నట్లు పేర్కొన్నారు. కాగా సాంకేతిక చొరవతో వ్యవసాయ రంగంలో స్థిరమైన అభివృద్ధికి దోహదపడే సహకారాన్ని అందుకోనున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది తులసీరామ్‌నాయుడు, శివయ్య తదితరులు పాల్గొన్నారు.


వైఎస్సార్ యూనివర్శిటీతో ఎంవోయూ కుదుర్చుకుంటున్న డీమ్డ్ టు బి మిట్స్ యూనివర్శిటీ వీసీ యువరాజ్ తదితరులు

శివాలయంలో విశేష పూజలు


ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న స్వామివారు

పెద్దతిప్పసముద్రం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన పెద్దతిప్పసముద్రంలో వెలసిన శ్రీప్రసన్న పార్వతీ సమేత విరూపాక్షేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ఆధ్యాత్మికవేత్త శ్రీ సనగరం పట్టాభిరామయ్య ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. శ్రావణమాసం సోమవారం సందర్భంగా ఆలయంలో ఉదయం నుండి స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి పూజలను నిర్వహించారు. ఆలయానికి భక్తులు పోటెత్తారు. స్వామి వారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నదానం నిర్వహించారు. అనంతరం శివాలయ సేవకులకు సనగరం పట్టాభిరామయ్య వినాయక చవితిని పురష్కరించుకుని 20 మందికి తన స్వంత నిధులతో మట్టి వినాయకుని విగ్రహాలతో పాటు పూజా కార్యక్రమాలకు రూ 200 వందలు అందించారు. శివాలయ సేవకులు భక్తి శ్రద్ధలతో వినాయకచవితి వేడుకలు జరుపుకోవాలన్నారు.

నేడు అక్షర ఆంధ్రపై శిక్షణ

కలికిరి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం 'అక్షర ఆంధ్ర'పై శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రియాజుద్దీన్ అహ్మద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా ఈ శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని, అందులో భాగంగా మండలంలో చేస్తున్నట్లు తెలిపారు. నిరక్షరాశ్యులైన వయోజనులను సంపూర్ణ విద్యావంతులను చేయడమే లక్ష్యంగా అక్షర ఆంధ్ర (ఉల్లాస్) కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. వెలుగు సీసీలు, ఏపీఎంలు, ఉపాధి హామీ ఏపీవోలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, వలంటరీ టీచర్లకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

15 మంది జూదరులపై కేసు

కలికిరి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రెండు వేర్వేరు ప్రాంతాల్లో జూదమాడుతున్న మొత్తం 15 మందిని అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేసినట్లు కలికిరి పోలీసు ఇన్‌స్పెక్టర్ ఎస్.అనిల్‌కుమార్ తెలిపారు. మండలంలోని పల్లవోలుతో పాటు, జేఎన్టీయూ కళాశాల ఉత్తరం వైపున పేకాట ఆడుతున్నారన్న ముందస్తు సమాచారం మేరకు సీఐ ఆధ్వర్యంలో పోలీసులు దాడులు జరిపారు. ఈ సందర్భంగా 15 మంది పేకాటరాయుళ్లు పట్టుబడ్డారు. వారి వద్ద నుంచి మొత్తం రూ.27,520 స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేసినట్లు సీఐ వివరించారు. ఈ దాడుల్లో హెచ్‌సీలు మదనమోహన్ రెడ్డి, మహ్మద్ ఆలీ, రాజేంద్రప్రసాద్, పీసీలు యల్లా రాజ, వెంకట్రమణ, గిరిప్రసాద్‌లు పాల్గొన్నట్లు సీఐ చెప్పారు.

రైతుల సమస్యలను పరిష్కరిస్తాం


రైతులతో మాట్లాడుతున్న వైస్ చైర్మన్ నౌషాద్‌అలీ

గుర్రంకొండ, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): గుర్రంకొండ టమోటా మార్కెట్ యార్డులో రైతుల సమస్యలను పరిష్కరిస్తామని వైస్ చైర్మన్ నౌషాద్‌అలీ పేర్కొన్నారు. సోమవారం మార్కెట్ యార్డులో వేలంపాటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కెట్ యార్డులో చిన్న క్రేట్‌లను అమలు చేసి జాక్‌పాట్ విధానాన్ని పూర్తిస్థాయిలో నిలువరిస్తామన్నారు. ఇందుకుగానూ కొంత మంది వ్యాపారులు చిన్న క్రేట్‌లను అమలు చేస్తున్నట్లు చెప్పారు. మార్కెట్‌లో పూర్తి స్థాయిలో చిన్నక్రేట్‌లను పది రోజుల్లో అమలు చేయాలని అధికారులకు సూచించారు. రైతులకు అవసరమైన వసతులను మార్కెట్ యార్డులో కల్పిస్తామని తెలిపారు. అనంతరం వేలంపాటలను పరిశీలించి రైతుల సమస్యలను తెలుసుకున్నారు.

ద్విచక్రవాహనం బోల్తా...

● వ్యక్తికి తీవ్రగాయాలు

నిమ్మనపల్లి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనం బోల్తా పడి వ్యక్తి తీవ్రగాయాలైన సంఘటన మండలంలో చోటు చేసుకొంది. స్థానికుల వివరాల మేరకు.. మండలంలోని వెంగంవారిపల్లి పంచాయతీ కొత్తకొండసానివారిపల్లికి చెందిన రైతు నవీన్(25) తన ద్విచక్రవాహనంలో సొంత పనుల నిమిత్తం నిమ్మనపల్లికు వచ్చి తిరిగి కొత్తకొండసానివారిపల్లి వెళుతుండగా మార్గ మధ్యంలో చిన్నల్లవారిపల్లి వద్ద తన ద్విచక్రవాహనం బోల్తా పడింది. ఈ ప్రమాదంలో నవీన్‌కు తీవ్రగాయాలు కావడంతో 108 సాయంతో మదనపల్లికు తరలించగా అక్కడ డాక్టర్లు తిరుపతి రూయాకు రెఫర్ చేశారు. దీనిపై స్థానిక పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

చేనేత నగర్‌లో చోరీ


చేనేతనగర్‌లో చోరీ జరిగిన దృశ్యం

కురబలకోట, ఆగస్టు 25(ఆంధ్ర జ్యోతి): మండలంలోని నందిరెడ్డిగారిపల్లె పంచాయతీ చేనేత నగర్‌లో ఆదివారం రాత్రి దొంగలు హల్‌చల్ చేసిన సంఘటన జరిగింది. దీనికి సంబంధించి బాధితులు, పోలీసుల కథనం మేరకు.. చేనేతనగర్‌కు చెందిన బాషా కూలి పనులు, వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కాగా ఇంటికి తాళం వేసుకుని అంగళ్లు గ్రామంలోని బ్రాహ్మణొడ్డుపల్లెకు తమ కుమార్తె ఇంటికి వెళ్లాడు. ఉదయం ఇంటికి తిరిగి రాగానే తలుపులు తెరచి ఉండటంతో చోరీ జరిగినట్లు గుర్తించారు. ఇంట్లో ఉన్న నగదు, బంగారం, విలువైన వస్తువులను అపహరించుకు పోయినట్లు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ముదివేడు ఎస్ఐ దిలీప్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిత్యాన్నదానానికి కూరగాయల వితరణ


తిరుమలకు కూరగాయలు తీసుకెళ్తున్న లారీ

రామసముద్రం, ఆగస్టు 25(ఆంధ్ర జ్యోతి): మండలంలోని ఎల్లంపల్లెకు చెందిన అమరనాథ్‌రెడ్డి, మిషన్ రెడ్డెప్పరెడ్డి కుటుంబ సభ్యులు ఎనిమిది టన్నుల కూరగాయలను టీటీడీ దేవస్థానానికి విరాళంగా సమర్పించారు. ఈ మేరకు సోమవారం కూరగాయలతో కూడిన లారీ తిరుమలకు బయలుదేరినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఏటా తిరుమలలో జరిగే నిత్యాన్నదానానికి తమవంతు స్వామి వారికి కూరగాయలు ఇస్తున్నామని చెప్పారు. వెంకన్న ఆశీస్సులు, అనుగ్రహంతో తమ పంటలు బాగా పండి సుఖ సంతోషాలతో ఉండాలని వేడుకుంటున్నట్లు తెలిపారు. వీరి సేవాగుణం మరెందరికో ఆదర్శమని కొనియాడారు.

ఏపీ కిసాన్ కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షుడిగా సింగం రామకృష్ణారెడ్డి

మదనపల్లె అర్బన్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): ఏపీ కిసాన్ కాంగ్రెస్ కమిటీ సమావేశం సోమవారం విజయవాడలోని ఆంధ్రరత్న భవన్‌లో నిర్వహించారు. కమిటీ అధ్యక్షుడు కామన ప్రభాకర్‌రావు రాష్ట్రవ్యాప్తంగా కొత్తకమిటీ సభ్యులను నియమించారు. ఇందులో భాగంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు సింగం రామకృష్ణారెడ్డిని ఏపీ కిసాన్ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడుగా నియమించారు. సింగం రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ రైతులకు సేవలందించడంలో తనవంతు కృషి చేస్తామన్నారు. ఈ పదవి ఇచ్చినందుకు ఏపీ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, కిసాన్ కమిటీ అధ్యక్షుడు ప్రభాకర్‌రావు, అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.